జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*



చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523



సంపుటి 4 సంచిక 85 | హైదరాబాద్, జనవరి 13 బుధవారం 2021 | 8 పేజీలు | వెల : 5.00


## భవిష్యత్‌లో నీటి కష్టాలుండవు:కేటీఆర్



హైదరాబాద్,జనవరి 12, ప్రజాపాలన : గ్రేటర్ పరిధిలోని రహ్మత్‌నగర్‌లోని ఎన్‌వీఆర్ హిల్స్‌లో ఉచిత తాగునీటి పథకాన్ని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఇంటింటికి తిరిగి జీరో నీటి బిల్లులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మేయర్ బొంతు రామ్మోహన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. హైదరాబాద్‌కు రెండు రోజుల ముందే సంక్రాంతి పండుగ వచ్చింది. తాను చదువుకునే రోజుల్లో తాగునీటి కోసం ఖాళీ బిందెలతో మహిళలు.. జల మండలి ముందు ధర్నా చేసేవారు. ప్రస్తుతం ఉచితంగా తాగునీరు అందించే స్థాయికి చేరుకున్నామని తెలిపారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇవాళ ఉచిత తాగునీటి పథకాన్ని ప్రారంభించుకున్నామని పేర్కొన్నారు. ఇంటింటికి తిరిగి జీరో నీటి బిల్లులు ఇచ్చామని చెప్పారు. డిసెంబర్ నల్లా బిల్లు కట్టాల్సిన అవసరం లేదు అని కేటీఆర్ తెలిపారు. గ్రేటర్ పరిధిలో 9 లక్షల పైచిలుకు కుటుంబాలకు ఉచిత తాగునీటి పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. రహ్మత్‌నగర్‌లో దోబీఘాట్ కట్టిస్తామన్నారు. 2048 వరకు హైదరాబాద్‌లో తాగునీటి కష్టాలు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. 9,714 కోట్లతో లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించామని తెలిపారు.

పేదలంతా అభివృద్ధి చెందాలి..

కులమతాలకు

మిగతా 3లో..

## యువతకు మంచి అవకాశాలు

### ప్రధాని నరేంద్రమోదీ

న్యూఢిల్లీ,జనవరి 12, ప్రజాపాలన : భారత రాజ్యంగ రూపకల్పనకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో నేషనల్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్-2021 జరుగుతుండటం చాలా సంతోషంగా ఉన్నదని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. నేషనల్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన వారిని ఉద్దేశించి ప్రధాని ఇవాళ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. తాము ఇటీవల తీసుకొచ్చిన నూతన జాతీయ విధానం-2020 జాతి అభివృద్ధి దిశగా పడిన కీలక ముందడుగు అని ప్రధాని పేర్కొన్నారు. తాము దేశ యువతకు మంచి అవకాశాలను కల్పించే వ్యవస్థను దేశంలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా దేశంలో వారసత్వ రాజకీయాలపై ప్రధాని మోదీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. వారసత్వ రాజకీయాలు



దేశానికి ఒక సవాలుగా మారాయని, వాటిని సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉన్నదని ఆయన వ్యాఖ్యానించారు. ఒకప్పుడు ఎన్నికల్లో విజయం కోసం ఇంటిపేరును ఎక్కువగా వాడుకునేవారని, ఇప్పటికీ దేశంలో వారసత్వ రాజకీయాలు పూర్తిగా తొలగిపోలేదని ప్రధాని గుర్తుచేశారు.

## వైద్యనిపుణులతో చర్చించి నిర్ణయిస్తాం: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, జనవరి 12 (ప్రజాపాలన) :** కోర్టులను పూర్తిస్థాయిలో తెరవాలన్న అంశంపై వైద్యనిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు మంగళవారం వెల్లడించింది. ఏడాది కాలంగా న్యాయస్థానాల్లో జరగాల్సిన వాదనలు, విచారణలు అన్నీ వీడియో కాన్ఫరెన్సుల్లోనే జరుగుతున్నాయి. ఈ విధంగా వాదనలు వినిపించడంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ఏ బోబ్డే నేతృత్వంలోని ధర్మాసనం దీనిపై వైద్యని పుణుల సలహా కీలకమని వ్యాఖ్యానించింది. కరోనా సంక్షోభంలోనూ కోర్టులు ప్రజలకు అందుబాటులోనే ఉన్నాయని సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా అన్నారు. కొన్ని ప్రాంతాల్లో కోర్టులను తెరచినా కరోనా కారణంగా న్యాయవాదులు హాజరు కావట్లేదని ధర్మాసనం తెలిపింది. సంక్షోభ సమయాల్లో న్యాయవాదులకు అండగా ఉండాలన్న అంశంపై ఉన్నత న్యాయస్థానం స్పందించింది. ఈ మేరకు సొలిసిటర్ జనరల్ న్యాయవాదులతో సమావేశం నిర్వహించి ఈ విషయంపై సమీక్షించాలని ఆదేశించారు. న్యాయవాదుల బార్ అసోసియేషన్లు కరోనా సమయంలో న్యాయవాదులకు అండగా నిలిచాయని తుషార్ మెహతా న్యాయస్థానానికి తెలిపారు. ప్రభుత్వం న్యాయవాదులకు వడ్డీ లేని రుణాలు అందించేలా చూడాలని న్యాయవాదుల ప్రతినిధి ధర్మాసనాన్ని కోరారు. ఈ అంశంపై రెండు వారాల తర్వాత విచారణ చేస్తామని తెలిపింది.



### బైడెన్ ప్రమాణస్వీకారం..

## ఎమర్జెన్సీ విధించిన ట్రంప్

### ఎఫ్‌బీఐ హెచ్చరికల నేపథ్యంలో కీలక నిర్ణయం



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. వాషింగ్టన్‌లో రెండు వారాల పాటు ఎమర్జెన్సీ విధించారు. వారం రోజుల క్రితం అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలకు వ్యతిరేకంగా ట్రంప్ మద్దతుదారుల క్యాపిటల్ హిల్ బిల్డింగ్ మీద దాడి చేయడమే కాక ప్రభుత్వ ఆస్తులను నాశనం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నూతన అధ్యక్షుడు జో బైడెన్ ప్రమాణ స్వీకారం సమయంలో ఉద్రిక్తతలు తలెత్తకుండా.. ముందు జాగ్రత్తగా చర్యగా ట్రంప్ వాషింగ్టన్‌లో ఎమర్జెన్సీ విధించారని వైట్‌హౌస్ ప్రెస్ ఆఫీస్ సోమవారం వెల్లడించింది. 'ఈ రోజు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. 59వ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని జనవరి 11 నుంచి 24 వరకు ఎమర్జెన్సీ ప్రకటించారు. గత వారం ట్రంప్ మద్దతుదారులు క్యాపిటల్ హిల్‌పై దాడి చేయడం వల్ల ఉద్రిక్త పరిస్థితులు తలెత్తిన నేపథ్యంలో ఫెడరల్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది' అని ప్రకటనలో ఉంది. ఈ నిర్ణయం వెలువడిన తర్వాత వాషింగ్టన్‌లో అత్యవసర పరిస్థితుల వల్ల స్థానిక జనాభాకు కలిగే కష్టాలను, బాధలను తగ్గించడం.. విపత్తు సహాయక చర్యలను సమన్వయం చేయడం.. స్టాఫోర్డ్ చట్టం టైటిల్ 5 కింద అధికారం పొందిన అవసరమైన అత్యవసర చర్యలకు తగిన సహాయం అందించడం.. ప్రాణాలను కాపాడటం, ఆస్తిని రక్షించడం, ప్రజారోగ్యం,

మిగతా 3లో..



### బర్డ్‌ఫ్లూకు భయపడొద్దు:ఈటల

హైదరాబాద్: బర్డ్‌ఫ్లూ వైరస్‌కు భయపడొద్దని మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. బర్డ్‌ఫ్లూతో ఇప్పటివరకు మనుషులకు ఎలాంటి నష్టం జరగలేదని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా హెల్త్ ర్యాపిడ్ యాక్షన్ టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. అపోహల వల్ల పౌల్ట్రీ పరిశ్రమ తీవ్రంగా నష్టపోతుందన్నారు. ఎలాంటి అపోహలు నమ్మొద్దన్నారు. వలస పక్షుల విషయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. తెలంగాణలో బర్డ్‌ఫ్లూ వచ్చే అవకాశం లేదని మంత్రి ఈటల స్పష్టం చేశారు.




### 100 రోజుల్లో తమిళ ఎన్నికలు

వివరాలు 3లో...

### డోలాయామానంలో ట్రంప్ భవితవ్యం

వివరాలు 3లో...

## సీఎం కేసీఆర్‌తోనే ఖమ్మం అభివృద్ధి : మంత్రులు

ఖమ్మం : ముఖ్యమంత్రి కేసీఆర్, యువనేత కేటీఆర్‌ల సహకారంతో ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియాన్ని అద్భుతంగా తీర్చిదిద్దగలిగామని, అన్ని ఆటలకు కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేసుకున్నామని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలు నిర్వహించేలా వివిధ అసోసియేషన్ల సహకారంతో కృషి చేస్తామని అన్నారు. మంగళవారం ఖమ్మం నగరంలో పలు అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, క్రీడల, పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నూతనంగా నిర్మించిన మొదటి ఫ్లోర్ భవనాన్ని, స్కేటింగ్ రింగ్‌ను, క్రికెట్ మైదానంలో టఫ్ వికెట్‌ను, అథ్లెటిక్ సాండ్ ట్రాక్ ప్రారంభించారు.

మిగతా3లో..





మన గొంతుక
Private and Confidential
మన హక్కు
మాస్టర్ కీ TV
(అంబేడ్కర్ TV)
MASTER KEY TV NEWS FOR EQUALITY
e-mail : ambedkartvchannel2018@gmail.com
website : www.ambedkartv.org
A UNIT OF SNEHA GROUP OF ORGANISATIONS
A Community built on Trust Since 2001
సామాజిక బాధ్యతతో మన స్వంత బహుజన మీడియాను నిర్మించుకుందాం.
1. బుద్ధిజం, ఫూలే, అంబేడ్కరీజాలను బహుజనుల్లో పెంపొందించడానికి
2. బహుజనుల సమస్యలను వెలుగులోనికి తీసుక రావడానికి
3. రాజ్యాధికారాన్ని సాధించడంలో కీలకపాత్ర పోషించడానికి
SNEHA GROUP OF ORGANISATIONS 20 YEARS CELEBRATIONS
ఛానల్ 26 నవంబర్ 2020 న ప్రారంభించబడింది
ఇదే మా ఆహ్వానం
బహుజనులు ( అభ్యుదయ వాదులు, కాపు, బలిజ, బి.సి. ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, క్రిస్టియన్ మరియు ఇతర అన్ని కులాల్లోని ప్రగతిశీలురు) అందరు డిపాజిట్ చేసి మీ ఆర్థిక అభివృద్ధితో పాటు సామాజిక అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి.
01 జనవరి 2021 నుండి 7 సం॥ల పాటు డిపాజిట్ చేసిన వారికి డబుల్ ఎమౌంట్ ఇవ్వబడును.
1. సామాజిక బాధ్యత: బహుజనుల ఆత్మగౌరవ సంరక్షణ
2. ఇచ్చిన వాగ్దానం: గత నిర్ణయం ప్రకారం డిసెంబర్6న ప్రారంభించాల్సిన అంబేద్కర్ టీవి ప్రస్తు కరోనా పరిస్థితుల దృష్ట్యా వాయిదా వేయవలసిన అవసరమున్నప్పటికీ గత 20 సంవత్సారాల స్నేహ గ్రూప్ ప్రయాణంలో ఏ కార్యక్రమాన్ని కూడా వాయిదా వేసిన సందార్భలు లేవు. అందువల్ల మూక్ నాయక్ పత్రికకు 100 సంవత్సారాలు పూర్తి అవుతున్న సందర్భముగా రాజ్యాంగాన్ని పరిరక్షించే క్రమంలో రాజ్యాంగ దినోత్సవం రోజైన Constitutional Day నవంబర్ 26, 2020న ప్రారంభించాం
3. ఉచితం: మీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో వికేంద్రీకరణ పద్ధతిలో మీడియా అధిపతిగా నియమించబడును. మీ ఐడియాలజీ ప్రకారం మీ అసెంబ్లీ వార్తలను మీరు నియమించిన రిపోర్టర్ ద్వారా పంపండి జర్నలిజాన్ని బ్రతికించి బహుజన అభివృద్ధితో పాటూ దేశాభివృద్ధి జరుగుతుందని నిరూపించండి.
మీకు తెలుసు బ్యాంకులు మనకు అప్పులు ఇవ్వడం లేదని, అందువలన మన బ్యాంకింగ్ వ్యవస్థను మనమే నిర్మించుకొని పేదవారికి అప్పులు ఇవ్వాలనే సంకల్పంతో గత 12 సం॥లు నుండి THE SNEHA MUTUALLY AIDED CO OPERATIVE THRIFT AND CREDIT SOCIETY LTD దిగ్విజయముగా నడుస్తుంది. 01 జనవరి 2021 నుండి 7 సం॥ల పాటు డిపాజిట్ చేసిన వారికి డబుల్ ఎమౌంట్ ఇవ్వబడును. అందువల్ల మీరు మీ బంధుమిత్రులు 100 మందితో ఒక్కొక్కరు 30 వేల రూపాయిలు డిపాజిట్ చేసి బ్యాంకింగ్ వ్యవస్థ నిర్మాణానికి తోడ్పడినవారికి ఈ ఉచిత (FREE) సౌకర్యం కల్పించబడినది.
మీ డిపాజిట్‌ని ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ లేదా డిపాజిట్ చెయ్యవచ్చు.
రాష్ట్ర ప్రభుత్వంతో రిజిష్టర్డ్ కాబడిన స్నేహ గ్రూప్ ఆఫ్ ఆర్గనైజేషన్స్‌లో ఒకటైన
THE SNEHA MUTUALLY AIDED CO OPERATIVE THRIFT AND CREDIT SOCIETY LTD బ్యాంకు
Account No. 37810035053 SBI, Bazarghat Branch, Hyderabad IFSC Code: SBIN 0005893
ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ లేదా డిపాజిట్ చేసిన తరువాత 7660027682/678/686 నెంబర్లకు సమాచారం ఇవ్వండి.
Sn. Dr. J.B. RAJU IIS-vrs Managing Director
Shri AREPALLY RAJENDAR Director - Coordination
Sn. Dr. K. SIVA BHAGYA RAO, IRS-vrs Founder & Chairman
Social Media :
youtube : https://www.youtube.com/channel/UCdMBr4exmaOKoyJV5NIONOw facebook : ambedkartv.telugu
Corporate Office : 6-2-26/3/12, 3rd Floor, Doulat Plaza, Lakdi-ka-pool, Hyderabad - 4
పక్షికి రెక్కలు లేకుంటే ఎగరలేదు. బహుజనులకు మీడియా లేకుంటే అభివృద్ధి లేదు. - డా॥ బి.ఆర్. అంబేడ్కర్

# స్వామి వివేకానంద 158 వ జయంతి వేడుకలు



బాలాపూర్: ప్రజాపాలన : మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 16 వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జిల్లెల్గుడా లో ఉన్న శ్రీ శ్రీ వివేకానంద స్వామి జయంతి పురస్కరించుకుని పాల్గొని అతిథులు కార్పొరేటర్లు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ..... యావత్ ప్రపంచంలో మహోన్నత వ్యక్తి స్వర్గీయ స్వామి వివేకానంద, ఆయన 12 జనవరి 1863 సంవత్సరంలో జన్మించినారు. వివేకానంద స్వామి సృజనాత్మక, మనో విచక్షణ, పక్రియ కు ప్రాణం పోసి దానిని విశ్వవ్యాప్తంగా ప్రాచుర్యం కల్పించిన స్ఫూర్తి సూక్తులు జీవితంలో హీనమైన కార్యకలాపాలకు తావులేకుండా ఉన్నతమైన ఆలోచనలతో ఉత్కృష్టమైన జీవితాన్ని సాగించాలని సంకల్పానికి నేటి యువతకు రావడమే... స్వామి వివేకానంద ఆలోచనలు అన్నారు. స్థానిక కార్పొరేటర్ ఏనుగుల అనిల్ కుమార్ మాట్లాడుతూ.... స్వామి వివేకానంద మాటల్లోనే సత్యం ఉండేది, ఆయన సూక్తులు యువతను మేలుకొలుపుతాయి. ఇనుప నరాలు, ఉక్కు కండరాలన్న 100 మంది యువకులను ఇస్తే ఈ దేశాన్ని మార్చి చూపిస్తాను... నీ అన్నా.... మహోన్నత వ్యక్తిత్వం ఆయనది అన్నారు. ఇలాంటి సక్సెస్ స్టోరీలు స్వామి వివేకానంద జీవితంలో ఉన్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దుర్గా దీప లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, టిఆర్ఎస్ అధ్యక్షులు సిద్దాల లావణ్య బీరప్ప, గజ్జల రామ్ చందర్, ఇంద్రావత్ రవి నాయక్, టెంపుల్ డైరెక్టర్స్ స్వర్ణలత, శేఖర్ గౌడ్, జ్ఞానేశ్వర్ చారి, మాజీ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు సిద్ధార్థ బీరప్ప, లంకల రమేష్ రెడ్డి, ఒంటేరు నరసింహారెడ్డి, పిసాటి ఇంద్రసేనారెడ్డి, వెంకటేష్ కుర్మా, సుర్వి శేఖర్ గౌడ్, మల్లారెడ్డి, లక్ష్మణ్ యాదవ్, రమణ రాజు, రామకృష్ణ గౌడ్, మనీ రాజు వివేకానంద అభిమానులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు

బాలాపూర్: ప్రజాపాలన : బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్గూడ బిజెపి నేతలు స్వామి వివేకానంద 158 వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జి అందెల శ్రీ రాములు యాదవ్, అధ్యక్షులు కార్పొరేటర్లు హాజరై విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మూడవ డివిజన్ కార్పొరేటర్ మాధురి వీర కర్ణ రెడ్డి, బిజెపి జిల్లా స్పోర్ట్స్ కన్వీనర్ శూర్ణ కర్ణ రెడ్డి, భారతదేశానికి చాటి చెప్పే ఘనత స్వామి వివేకానంద జయంతి సందర్భంగా బిజెపి మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి అందెల శ్రీ రాములు యాదవ్ కి, అదేవిధంగా బడంగ్పేట్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నరసింహారెడ్డి కి, మీర్ పేట్ పోలీస్ స్టేషన్ సీఐ మహేందర్ రెడ్డి కి, స్వామి వివేకానంద విగ్రహాన్ని బహూకరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## నేటి యువతకు శారీరక శ్రమ తగ్గటం వల్లే చిన్న వయసులోనే ఆరోగ్య సమస్యలు





బాలాపూర్: ప్రజాపాలన : బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుర్మలగుడా గ్రామంలో శారీరక, మానసిక ధృఢత్వంతోనే లక్ష్యం ముందుకు సాగాలని పిలుపునిచ్చిన మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి, వివేకానంద జయంతి సందర్భంగా టేకుల భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను అందెల ప్రారంభించారు. వివేకానంద స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

నేటి యువతకు శారీరక శ్రమ తగ్గటం వల్లే చిన్న వయసులోనే ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జే.ఎస్.ఎస్. యూ.ఆర్.ఎం కాలనీలో జరిగిన కబడ్డీ పోటీలు నిర్వహించి నేటి యువతకు ఆదర్శం కావాలి అన్నారు. కంప్యూటర్ యుగంలో యువత, విద్యార్థులకు శారీరక శ్రమ తగ్గిందన్నారు. ఇలాంటి కబడ్డీ క్రీడలు నిర్వహించడం వల్ల శారీరక ధృఢత్వం పెరిగి మానసికంగా ఉల్లాసంగా తయారు అవుతారని శ్రీరాములు చెప్పారు. భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి రాగానే ప్రతీ కాలనీలో క్రీడా మైదానం ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో బడంగ్ పేట కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, జి. దొడ్డి మల్లికార్జున్, తిరుపతి, సంతోష్ ముదిరాజ్, టేకుల పెద్ద మల్లారెడ్డి, బంగారి బాబు, సీ హెచ్ లింగమయ్య, నాగరాజు, నరహరి, కరీం, నరేష్, మల్లేష్, సంతోష్, శ్రీశైలం సహా బీజేపీ, బీజేవైఎం నాయకులు యువకులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ను ఆవిష్కరించిన జడ్పీ చైర్ పర్సన్ వసంత



జగిత్యాల, జనవరి 12 (ప్రజాపాలన): జగిత్యాల జిల్లా ప్రజా పరిషత్ క్యాంపు కార్యాలయంలో తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జగిత్యాల జిల్లా నూతన సంవత్సర 2021 క్యాలెండర్ ను జిల్లా జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ ఉద్యోగులందరూ అంకిత భావంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని ముందస్తుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శ్రీనివాస్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ అధికారులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు



వెల్గటూర్, జనవరి 12 (ప్రజాపాలన) : వెల్గటూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ఖండాంతరాలకు వ్యాపింప చేసిన ఆయన కృషిని కొనియాడారు. అనంతరం కరోనా నియంత్రణ లో భాగంగా పలువురికి మాస్క్ లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు మద్ది మురళీధర్, కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షులు సిరిపురం తిరుపతి, ఎ న్. వెంకట్రెడ్డి,కోశాధికారి గట్ల రాజేందర్, పి.ఆర్.ఓ నక్క సురేష్, డైరెక్టర్లు రేణిగుంట ప్రసాద్, గుంత శ్రీనివాస్, బొనగిరి సత్తయ్య నీలం సంపత్ కుమార్, ఎం.డి అఫ్సర్, తదితరులు పాల్గొన్నారు.

## న్యూ గాయత్రీ నగర్ కమిటీ హాల్ లో వివేకానంద జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం





బాలాపూర్ : ప్రజాపాలన : మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూడో డివిజన్ కార్పొరేటర్ ఏ. రాజమణి రెడ్డి ఆధ్వర్యంలో వివేకానంద జయంతి సందర్భంగా న్యూ గాయత్రీ నగర్ కమిటీ హాల్ లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు పెండ్యాల నరసింహ్మా, కార్పొరేషన్ కార్పొరేటర్లు హాజరై, ముందుగా వివేకానంద స్వామి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వివేకానంద స్వామి జయంతి సందర్భంగా 20 మంది రక్త శిబిరం లో రక్తదానం ఇచ్చారు. బొక్క నర్సింహారెడ్డి శ్రీ శ్రీ వివేకానంద స్వామి గురించి ప్రసంగించారు..... యావత్ ప్రపంచమంతా భారతదేశం వైపు చూసేలా చేసిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద ఆయన సూక్తులు విని ఆచరించినవారు ఎంతటి బద్దకస్తువారైనా జీవితంలో సక్సెస్ అయినవారు ఎంతో మంది ఉన్నారు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు పెండ్యాల నరసింహ్మా, మీర్పేట్ కార్పొరేషన్ కార్పొరేటర్లు మద్ది సబితా రాజశేఖర్ రెడ్డి, కీసర గోవర్ధన్ రెడ్డి, పసునూరి బిక్షపతి చారి, కీసర హరినాథ్ రెడ్డి, కరుణానిధి, భీమ్ రాజ్, సోమేశ్వర్, కృష్ణారెడ్డి, ఈ నాగరాజ్, యాదగిరి యాదవ్, కుమార్ అమర్నాథ్ రెడ్డి, రఘు, ముకేష్ యాదవ్, నరసింహ యాదవ్, మల్లికార్జున్, బీజేపీ కార్యకర్తలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## జాగృతి మండల మహిళా సమాఖ్య రైస్ డిపోను ప్రారంభించిన ఎమ్మెల్యే సంజయ్



సారంగాపూర్, జనవరి 12 (ప్రజాపాలన): సారంగాపూర్ మండల కేంద్రంలోని మండల జాగృతి మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో రైస్ డిపో (బియ్యం దుకాణం) ను స్థానిక ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం మహిళ సమాఖ్య వారి వద్ద నుండి మొదటగా రైస్ బ్యాగ్ మరియు గోధుమ పిండిని కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మెడిపల్లి మనోహర్ రెడ్డి తహశీల్దార్ తిరుమల్ ఎంపీడీవో పుల్లయ్య ప్యాక్స్ చైర్మన్ ఏలేటి నరసింహ రెడ్డి ఎంపీటీసీ జోగినపల్లి సుధాకర్ రావు సోల్లు సురేందర్ గుర్రాల రాజేందర్ రెడ్డి ఢిల్లీ రామారావు మహిళా సమాఖ్య సంఘాల నాయకులు మహిళలు పాల్గొన్నారు.

## రైలు పట్టాలపై ఆత్మహత్య ప్రయత్నం



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జనవరి 12 ( ప్రజాపాలన ) : కెరెల్లి గ్రామానికి చెందిన క్రిష్ణ (35) మంగళవారం రైల్వే ట్రాక్ పై ఆత్మహత్య చేసుకుంటున్నానని తన తల్లిదండ్రులకు వీడియో కాల్ చేశాడు. వెంటనే స్పందించిన తల్లిదండ్రులు 100 కు డయల్ చేశారు. సమాచారం అందుకున్న క్లూ కోల్ట్ పోలీసులు రవి, భాస్కర్ లు వెంటనే స్పందించి స్థానికుల సహకారంతో ఆత్మహత్య చేసుకోబోయే క్రిష్ణను వెతికి పట్టుకున్నారు. క్రిష్ణకు క్లూ కోల్ట్ పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చిన తరువాత అతని తల్లిదండ్రులకు అప్పగించారు. కష్టకాలం నుండి మా కుమారుణ్ణి రక్షించారని క్లూ కోల్ట్ పోలీసులను అభినందించారు.

## పూలపల్లి గ్రామానికి చెందిన గంగ్యాడ వెంకటయ్య భూమి గోల్ మాల్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జనవరి 12 ( ప్రజాపాలన ) : పూలపల్లి గ్రామంలో సర్వే నంబర్ 140/అ2లో 1.07 ఎకరాల భూమి నా పేరు మీద ఉందని గంగ్యాడ ఆశయ్య కుమారుడు వెంకటయ్య తెలిపాడు. కానీ ఆ భూమిని నాకు తెలియకుండా గంగ్యాడ బుచ్చయ్య కుమారుడు అంతయ్య పేరు మీద సంబంధిత అధికారులు ఎందుకు మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం పూర్తి వివరాలు ఇవ్వాలని వికారాబాద్ ఆర్డిఒ ఉపేందర్ రెడ్డికి వినతి పత్రం మంగళవారం అందజేశారు. నా భూమి ఎలా ఎప్పుడు ఎందుకు మార్చబడిందో సరైన కారణాలతో జిరాక్స్ కాపీలు ఇవ్వాలని కోరారు. సర్వే నంబర్ 140 గంగ్యాడ బుచ్చయ్య పేరు మీద ఎంత భూమి ఉంది. సర్వే నంబర్ 140/అ2లో నుంచి గంగ్యాడ బుచ్చయ్య కుమారుడు అంతయ్య పేరు మీద 2005లో ఎందుకు మార్చబడింది. అట్టి ఫైల్ నంబర్ ఆర్ఓఆర్ ఎన్/95/16, 2005 మార్చబడినచో అట్టి ఫైల్ పూర్తి వివరాలు తేదీ, ప్రొసీడింగ్ ఆర్డర్ కాపీ, పంచనామా కాపీ, మొత్తం సర్టిఫికెట్లు కావాలని డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 140/అ2లో 2004 2005 సంవత్సరానికి కంటే ముందు ఎవరి పేర్ల పైన పట్టా ఉందో తెలపాలని డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 146/అ2లో పహానిలు 1985 నుండి 2020 వరకు కావాలన్నారు. ఖాతా నంబర్ 365 లో గంగ్యాడ వెంకటయ్యకు మొత్తం భూమి ఎంత, గంగ్యాడ అంతయ్య బుచ్చయ్య కు ఎంత భూమి ఉంది. పై అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం తెలుపగలరని కోరారు.

## సాతారంలో ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు..



మల్లాపూర్, జనవరి 12 ( ప్రజాపాలన ) : సమాజం కోసం పాటుపడిన వారందరూ మహానుభావులే. అందులో కొంతమంది మహర్షులవుతారు. అందులో ముందుండే వ్యక్తి స్వామి వివేకానంద అని యువజన సంఘాల అధ్యక్షుడు బొడ్డు రాజేష్ అన్నారు. మల్లాపూర్ మండలం సాతారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించిన స్వామీ వివేకానంద 158వ జయంతి వేడుకల కార్యక్రమంలో పాల్గొన్న రాజేష్ బలమే జీవనం.. బలహీనతే మరణం,అన్న స్వామి వివేకానంద మాటలను గుర్తుకు తెచ్చారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు చంద్రప్రకాశ్, యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు బొడ్డు రాజేష్ , ఉపాధ్యాయులు నరేష్, హరికృష్ణ, రాజేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## యువత వివేకనందుని బాటలో పయనించాలి:జడ్పీ చైర్ పర్సన్ సునీతారెడ్డి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జనవరి 12 ( ప్రజాపాలన ) : యువత స్వామి వివేకనందుని బాటలో పయనించాలని జడ్పీ చైర్పర్సన్ సునీతారెడ్డి సూచించారు. వివేనందుని 158 జయంతిని పురుష్కరించుకుని తన నివాసంలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. నేటి తరం యువతకు స్వామి వివేకనంద స్ఫూర్తి దాయకమన్నారు. వివేకనంద జీవితం ప్రతీ ఒక్కరికి మార్గదర్శకం కావాలన్నారు. చిన్నవయసులోనే యావత్ ప్రపంచాన్ని సన్మార్గంలో నడిపే ఎన్నో ఉపాన్యాసాలు చేశారని గుర్తు చేశారు. ప్రపంచానికి భారతీయ వేదాంతాన్ని, ఆధ్యాత్మికత, యోగ, తత్వాలను పరిచయం చేశాడని అన్నారు. ఆయన ప్రతీ మాట ఒక సూక్తిగా యావత్ ప్రపంచం అనుసరిస్తుందని కొనియాడారు. యువతరం పాశ్చాత్యపోకడలకు బానిస కాకుండా దేశ ఔన్నత్యాన్ని పెంపొందించేలా నడుచుకోవాలని పిలుపునిచ్చారు.

## యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద



బాలాపూర్ : ప్రజాపాలన : బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుర్రం గూడా లోని పలు కాలనీలో స్వామి వివేకానంద జయంతి వేడుకలకు ముఖ్య అతిథి 7వ డివిజన్ కార్పొరేటర్ గడ్డం లక్ష్మారెడ్డి హాజరై స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గడ్డం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... యోగి రామకృష్ణ పరమహంస శిష్యుడైన స్వామి వివేకానంద గొప్ప కుటుంబం లో పుట్టిన చిన్నప్పట్నుంచి అధ్యాత్మ కథపై ఇంట్రెస్ట్ చూపించారు. రామాయణం, మహాభారతం, వేదాలు, ఉపనిషతులు, భగవద్గీత ను చదువుతూ సందేహాలుంటే తన తల్లి ని అడిగి తెలుసుకునేవారు. చిన్నతనంలోనే ఏదైనా సాధించాలనే తపన ఉండే వ్యక్తి వారి సూక్తులు వారి సూచనలు ఈనాటి యువతరానికి ఆశాజ్యోతిగా పని చేస్తూ ముందుకు వెళ్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఏడో డివిజన్ కార్పొరేటర్ గడ్డం లక్ష్మారెడ్డి, రావుల పోశయ్య, కొండ హేమంత్ రెడ్డి, గోరిగే సతీష్, రావుల శివ, మారుతి రెడ్డి, గోరిగే కిరణ్, నత్తి శివ, ఆర్ల శివ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా స్వామి వివేకానంద జయంతి

### యువత వివేకానందుని ఆదర్శంగా తీసుకోవాలి
### ఎంపీపీ అరిగెల మల్లికార్జున్

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జనవరి12(ప్రజా పాలన): నేటి యువత వివేకానందుని ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూల మాల వేసి, ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ భారత సనాతన శక్తిని, ధార్మిక విలువలను కంచానికి చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. యువత వివేకానందుని మార్గదర్శకంగా తీసుకొని, ముందుకు నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్విండో చైర్మన్ అలీ బిన్ అమ్మద్, బద్రి సత్యనారాయణ, సర్పంచ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంధం శ్రీనివాస్, పెద్ద పెల్లి శ్రీనివాస్, పెంటయ్య, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

### డీఈఓ పాణిని కు పి ఆర్ టీ యు నాయకుల వినతి



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జనవరి12(ప్రజా పాలన): పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మంగళవారం పిఆర్టీయు సంఘం ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి పాణిని కి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస రావు, ఆడే ప్రకాష్ లు మాట్లాడుతూ నిష్ట శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రావలసిన రివ్యూ నేషన్ ను వెంటనే చెల్లించాలని కోరారు. వేసవి లో ఎంపీటీసీ, జెడ్పిటిసి, ఎన్నికలలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఈ ఎల్ ఎస్ ను మంజూరు చేయాలని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా స్కూల్ గ్రాంట్స్ ను ఎస్బిఐ ఖాతాను మూసివేయడంతో కొన్ని పాఠశాలలకు ఆంధ్ర బ్యాంక్ లో జమ కాకుండా ఉన్నటువంటి పాఠశాలలకు గ్రాంట్ మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా 2019, 20 సంవత్సరంలో పనిచేసిన విద్యా వాలంటరీల జనవరి, ఫిబ్రవరి, మార్చ్, మాసాల వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ సమస్యలపై స్పందించిన డీఈఓ త్వరలోనే విద్యాశాఖలో నెలకొని ఉన్నా సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో నాయకులు యాదవ్ గోవింద్, సాంబశివ రావు, శంకర్, చరణ్ సింగ్, భూమేష్, నరేంద్ర లు ఉన్నారు.

## డ్రైవర్లు కు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం



మధిర,జనవరి 12, ప్రజాపాలన : సిఐ మురళి గారి ఆదేశాల మేరకు మధిర రూరల్ ఎస్ఐ గారి ఆధ్వర్యంలో మధిర నందిగామ రోడ్డు వద్ద పాసెంజర్ ఆటో డ్రైవర్లు కు, ట్రాలీ ఆటో డ్రైవర్లు కు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అవగాహన కార్యక్రమంలో బాగ%శీ%గా ఆటోలో ఎక్కువమందిని ఎక్కించడం గాని , అతి వేగంగా వెళ్లడం గాని , తాగి డ్రైవింగ్ చేయకూడదని , ట్రాలీలో ప్రజలను ఎక్కించు కూడదని . కూలి పనికి వెళ్లి వారిని ఆటోలో ఎక్కువ మందిని ఎక్కించి కూడదని, అంతేకాకుండా ట్రాలీ ఆటోలో కూలీలను ఎక్కించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు .

## ముగ్గులు పోటీలు

మధిర,జనవరి 12, ప్రజాపాలన : మున్సిపాలిటీ పరిధిలోని బంజారా కాలనీ నందు శ్రీ సింగ్ వెంకటేశ్వర రావు గారి సతీమణి లక్ష్మి కాంతమ్మ గారి జ్ఞాపకార్థం తో సంక్రాతి పండుగ సందర్భంగా ముగ్గులు పోటీలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత హాజరై పోటీ లో పాల్గొనా వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం లో మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ విద్యా లత,మునిసిపల్ కమిషనర్ రమాదేవి,8వ వార్డ్ కాన్సిలర్ అప్పారావు,19 వ వార్డ్ కౌన్సిలర్ మాధవి తదితరులుపాల్గొన్నారు



# మండల కేంద్రంలోఅలిశెట్టి ప్రభాకర్ వర్ధంతి మరియి వివేకానంద జయంతి వేడుకలు



గొల్లపల్లి, జనవరి12 (ప్రజాపాలన): గొల్లపల్లి మండల కేంద్రంలో ఈ రోజు పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 158 జయంతి ఉత్సవాలను నిర్వహించడం జరిగింది యువజన సంఘం అధ్యక్షులు అంకం రవి గారు మాట్లాడుతూ యువత ప్రతి ఒక్కరూ స్వామి వివేకానంద స్పూర్తితో కొనసాగుతూ వారి యొక్క ఆశయాలను ముందు ప్రతి ఒక్కరు ఆచరించే విధంగా చూడాలని కోరారు అలాగే జగిత్యాల పద్మశాలి ముద్దుబిడ్డ అలిశెట్టి ప్రభాకర్ జయంతి వర్ధంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం జరిగింది అలిశెట్టి ప్రభాకర్ జయంతి వర్ధంతిని పురస్కరించుకొని వారు రచించిన టువంటి ఒక చిన్న రచనను చదివి వినిపించారు చేయి చాచి అడగకు ఇక్కడెవరు ప్రాణభిక్ష పెట్టారు చేతులెత్తి మొక్కకు ఇక్కడెవరు అరాచకాలను అరికట్టరు ఇక్కడ మనిషికి మనిషే భయం ఇది మారణహోమలయం అనే కవితను గుర్తు చేస్తూ ఎవరికివారు సొంతంగా తమ తమ స్వశక్తితో ముందుకు నడవాలని ప్రతి ఒక్కరు తమ తమ ఆశయాలను నెరవేర్చుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో గొల్లపల్లి పద్మశాలి పట్టణ అధ్యక్షుడు అంకం భూమయ్య, మండల అధ్యక్షులుకస్తూరి సత్యం ,యువజన సంఘం కోశాధికారి చౌటపల్లి రఘునందన్,అంకమ్ గణేష్, శ్రీనివాస్ అంకమ్ మహేష్,ఎనగందుల సాయికృష్ణ అంకమ్ చంద్ర సాయి,అనుమల్ల రఘు,అంకమ్ అరుణ్,చౌటపల్లి హర్షిత్,బొండ్ల అభిషేక్, అభిలాష్, దీపక్ హర్ష,తదితరులు పాల్గొన్నారు.

# 100 రోజుల్లో తమిళ ఎన్నికలు

**చెన్నై, జనవరి 12 (ప్రజాపాలన)** : తమిళనాడు ఎన్నికలను నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ సిద్ధమవుతోంది. ఈ మేరకు అధికారులు సమావేశమై ఎన్నికలపై చర్చించినట్లు తెలిసింది. తమిళనాడు శాసన సభకు రానున్న మే 24వ తేదీతో గడువు ముగియనుంది. ఈలోపే ఎన్నికలను నిర్వహించాల్సి ఉంది. అయితే ఏప్రిల్ నెల ఆరంభంలోనే తమిళనాడు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ సమాయత్తమవుతోంది.వచ్చే ఏడాది మొత్తం ఐదు రాష్ట్రాలకు ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమబెంగాల్, కేరళ, అసోం, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలకు ఎన్నికలను నిర్వహించాల్సి ఉంది. అయితే తొలి దశ పోలింగ్ను ఏప్రిల్ 7వ తేదీన నిర్వహించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. అదే రోజు పుదుచ్చేరి ఎన్నికలను కూడా నిర్వహించనున్నారు. దీంతో ఒక తమిళనాడు, పుదుచ్చేరి ఎన్నికలకు కేవలం వంద రోజుల సమయం మాత్రమే ఉంది. వచ్చే నెలలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశముంది. ఇప్పటికే తమిళనాడులో అన్ని పార్టీలు ఎన్నికలకు సమాయత్తమయ్యాయి. కూటములను కూడా ఏర్పరచుకున్నాయి. ప్రధాన పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకేలు ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించాయి. డీఎంకే అయితే అనధికారికంగా అభ్యర్థులను కూడా కొన్ని చోట్ల నిర్ణయించింది. వారిని ప్రచారం చేసుకోవాల్సిందిగా స్టాలిన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. మరోవైపు అన్నాడీఎంకే, బీజేపీ కూటమి కూడా ఎన్నికలకు సమాయత్తమయింది. పళనిస్వామి ప్రచారాన్ని ప్రారంభించారు. పదేళ్లు అధికారంలో ఉండటంతో ఈసారి గెలుపుపై అనుమానాలుండటంతో కొంత ముందుగానే అభ్యర్థులను ప్రకటించాలని అన్నాడీఎంకే భావిస్తుంది. మక్కల్ నీది మయ్యమ్ అధినేత కమల్ హాసన్ సయితం ప్రచారాన్ని ప్రారంభించారు. మొత్తం మీద తమిళనాడు ఎన్నికలకు ఇంకా వంద రోజుల సమయం మాత్రమే మిగిలి ఉండటంతో పొత్తులు, ఎత్తులు, సీట్ల పంపకాలపై అన్ని పార్టీలు కసరత్తులు ప్రారంభించాయి

# డోలాయామానంలో ట్రంప్ భవితవ్యం

**న్యూఢిల్లీ, జనవరి 12 (ప్రజాపాలన)** : ట్రంప్‌ను మామూలుగా టార్గెట్ చెయ్యట్లేదు. అగ్రరాజ్యంలో ఆయనకు పొలిటికల్ కెరీరే లేకుండా చెయ్యాలని డిసైడ్ అయ్యారు డెమొక్రాట్స్. పర్మనెంట్‌గా ఆయన్ని ఇంటికే పరిమితం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ట్రంప్ భవిష్యత్‌లో మళ్లీ అధ్యక్ష పదవికి పోటీ చేయకుండా, మరే పదవిలో అడుగుపెట్టకుండా నిషేధం విధించేందుకు? ఉచ్చు బిగిస్తున్నారు డెమొక్రాట్లు. అమెరికాలో ప్రస్తుతం కొత్త అధ్యక్షుడి ప్రమాణ స్వీకారానికి సంబంధించిన టాక్ నడవాలి.. కానీ ఇప్పుడు అక్కడంతా ట్రంప్ గురించే మాట్లాడుకుంటున్నారు. అందుకు ట్రంప్ స్టేట్‌మెంట్సే కారణం. కొత్త అధ్యక్షుడు బైడెన్ ప్రమాణ స్వీకారానికి నేను రానని డైరెక్ట్ గా చెప్పేశారు ట్రంప్. అమెరికా చరిత్రలో గత 152 ఏళ్లలో ఇలా జరగడం ఇదే తొలిసారి. గతంలో కొందరు అధ్యక్షులు రాకుండా కొత్త అధ్యక్షుడి ప్రమాణ స్వీకారానికి రాకుండా ఉన్నారుగానీ.. రానని ముందే చెప్పిన తీరు మాత్రం 1869 తర్వాత మళ్లీ ఇప్పుడే జరిగింది. ట్రంప్ స్టేట్‌మెంట్స్, క్యాపిటల్ భవనంపై దాడి నేపథ్యంలో రివేంజ్ తీర్చుకోవాలనుకుంటున్నారు డెమొక్రాట్లు. అందుకే ట్రంప్‌ను పదవీ నుంచి తొలగించేందుకు ప్లాన్ వేస్తున్నారు. జనవరి 20 వరకూ కూడా ఆయన్ని పదవిలో ఉంచకుండా ముందుగానే ఇంటికి పంపాలనుకుంటున్నారు. భవిష్యత్తులో ట్రంప్ అధ్యక్ష పదవికి కూడా పోటీ చేయకుండా చేయాలనుకుంటున్నారు డెమొక్రాట్లు. ట్రంప్‌కు మరోసారి పోటీ చేసేందుకు అవకాశం ఉంది. కానీ 2024లో ఆయన అసలు బరిలో దిగకుండా చేసేందుకు వ్యూహాలు రచిస్తున్నారు డెమొ క్రాట్లు. ట్రంప్‌పై అభిశంసన తీర్మానం చేసి గానీ, లేదా 25వ రాజ్యాంగ సవరణను ఉపయోగించి గానీ పదవి నుంచి సాగనంపాలనుకుంటున్నారు. ట్రంప్‌ను జనవరి 20కి ముందే పదవిలో నుంచి దించాలంటే కాస్త కష్టమే. కానీ భవిష్యత్‌లో ట్రంప్ అధ్యక్ష పదవికి పోటీ చేయకుండా నిషేధించే తీర్మానాన్ని సెనేట్ ఆమోదించే అవకాశాలు ఉన్నాయి. ఈ తీర్మానం నెగ్గటానికి సాధారణ మెజార్టీ చాలు. ట్రంప్ అధికారంలో ఉన్నప్పుడు అభిశంసన ప్రక్రియ మొదలెట్టి? బైడెన్ అధ్యక్షుడయ్యాక దాన్ని కొనసాగించొచ్చు.

## భవిష్యత్‌లో నీటి కష్టాలుండవు:కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

అతీతంగా పేదలంతా అభివృద్ధి చెందాలన్నదే టీఆర్ఎస్ ధ్యేయమని తేల్చిచెప్పారు. బస్తీల్లోని పేదల కోసం అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. బలహీన వర్గాల పిల్లలను విదేశాలకు పంపి చదివిస్తున్నామని గుర్తు చేశారు. రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

ఏడేళ్ల కేసీఆర్ పాలన స్వర్ణయుగం

కరోనా సంక్షోభంలోనూ సంక్షేమం ఆగలేదు. ఏ పథకం కూడా ఆగలేదు. కేసీఆర్ నాయకత్వంలో సంక్షేమ రంగంలో స్వర్ణయుగం వచ్చింది. ప్రభుత్వంపై రూ. 500 కోట్ల భారం పడినా పేదల కోసం భరిస్తున్నామని స్పష్టం చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అనేక కష్టాలు ఉండేవి. తమ ఏడేండ్ల పాలనలో పన్నులు పెంచలేదు. రిజిస్ట్రేషన్, కరెంట్ బిల్లులు, ఇంటి పన్నులు పెంచలేదు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచుతూ దాన్ని పేదలకు పంచుతున్నామని తెలిపారు. ఎన్నికలు లేనప్పుడూ కూడా ప్రజల మధ్యే ఉంటూ సేవ చేస్తున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## సీఎం కేసీఆర్‌తోనే ఖమ్మం అభివృద్ధి : మంత్రులు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఖమ్మం నుంచి అగ్గి పుట్టిందని మా నాయకుడు కేసీఆర్‌ను భుజానికి ఎత్తుకున్న ఉద్యమకారులు జిల్లాలో ఎంతో మంది ఉన్నారన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా వంద స్టేడియాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 45 స్టేడియాలను పూర్తి చేశామని ప్రతి నియోజకవర్గంలో కూడా ఒక స్టేడియం ఉండేలా రూపకల్పన చేస్తామన్నారు. అనంతరం పర్యాటకుల కోసం ఖమ్మంలో రూ. 10 కోట్లతో హరితప్లాజా హోటల్‌కు, బైపాస్‌రోడ్‌లోని ఎకరం స్థలంలో రూ. 2 కోట్లతో బీసీ భవన్‌కు, లకారం ట్యాంక్‌బండ్‌పై తీగల వంతెనకు శంకుస్థాపన చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఈట్‌స్ట్రీట్, మ్యూజికల్ ఫౌంటెన్‌లను ప్రారంభించారు. అనంతరం సర్దార్ సర్వాయి పాపన్న కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన పంచాయతీ ఉద్యోగుల సమ్మేళనంలో పాల్గొన్నారు.

## ఎమర్జెన్సీ విధించిన ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

భద్రత, విపత్తు ముప్పును తగ్గించడం, నివారించడం వంటి బాధ్యతలన్ని ఫెడరల్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ, హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం పర్యవేక్షిస్తుంది. ఇక ఈ అత్యవసర సహాయ చర్యలకు అవసరమైన నిధులను ఫెడరల్ ప్రభుత్వమే 100 శాతం అందిస్తుంది. జో బైడెన్ ప్రమాణ స్వీకార కార్యక్రమం సందర్భంగా ట్రంప్ మద్దతుదారులు ఈ వీకెండ్, జనవరి 20న మొత్తం 50 రాష్ట్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తోన్నట్లు ఎఫ్‌బీఐ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడింది. ఈ మేరకు పెంటగాన్ వాషింగ్టన్ సిటీలో మరోసారి దాడులు జరగకుండా చూడాలనే ఉద్దేశంతో క్యాపిటల్ సిటీలో 15 వేల మంది జాతీయ భద్రతా దళాలను మోహరించింది.

# నిమ్మగడ్డ న్యాయ పోరాటం..?

**విజయవాడ, జనవరి 12, (ప్రజా పాలన) :** రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ మరోసారి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు చెప్పడంపై ఆయన రిట్ పిటీషన్ దాఖలు చేశారు. నిమ్మగడ్డ రమేష్ కుమార్ న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు. నిమ్మగడ్డ రమేష్ కుమార్ తొలి నుంచి వివాదంగానే ఉన్నారు. ఆయన చర్యలు, వ్యవహార శైలి ఒక పక్షానికి అనుకూలంగానే ఉన్నట్లు స్పష్టంగా కన్పించింది. ఈ వివాదానికి ఇంతటితో ఫుల్ స్టాప్ పెట్టి ఉంటే నిమ్మగడ్డ రమేష్ కుమార్ కు గౌరవం దక్కి ఉండేది. కానీ ఆయన మరోసారి కాలు దువ్వేందుకు సిద్ధమవుతున్నారు. నిజానికి పంచాయతీ ఎన్నికలు జరగాలంటే ప్రభుత్వ సహకారం అవసరం. ప్రభుత్వ ఉద్యోగులు సయితం మద్దతు తెలపాల్సి ఉంటుంది. కానీ ఈ రెండు అంశాల్లో నిమ్మగడ్డ రమేష్ కుమార్ కు సహకారం లేదనే చెప్పాలి. అయినా ఆయన ఎన్నికలను నిర్వహించాలనే ముందుకు వెళుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఈ సందర్భంగా ఉటంకిస్తున్నారు.



ఒకసారి షెడ్యూల్ విడుదలయిన తర్వాత ఎన్నికల ప్రక్రియ ఎక్కడా ఆగలేదన్న విషయాన్ని ఆయన గుర్తు చేస్తున్నారు. అయినా ఈ వివాదం ఇప్పట్లో తేలేది కాదు. డివిజన్ బెంచ్ లో నిమ్మగడ్డ రమేష్ కుమార్ కు సానుకూల తీర్పు వచ్చినా ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తుంది. అంటే ఎన్నికల ప్రక్రియలో కాలయాపన అనివార్యమన్నది ఖచ్చితం. మరోవైపు ఉద్యోగ సంఘాలు కూడా ఎన్నికలకు సుముఖంగా లేకపోవడంతో వారు కూడా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాయి. న్యాయప్రక్రియ ముగిసే నాటికి నిమ్మగడ్డ రమేష్ కుమార్ పదవీ కాలం పూర్తవుతుంది. అయినా నిమ్మగడ్డ రమేష్ కుమార్ ప్రభుత్వంపై పోరాటం చేయడానికే సిద్ధమయ్యారు. జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే చివరకు నిమ్మగడ్డ రమేష్ కుమార్ పావుగా మారతారనడంలో ఎటువంటి సందేహం లేదు.

**మరో 3 నెలలు పదవీ కాలం...**

జగన్ సర్కార్ కి ఎందరో శత్రువులు. మరెందరో ప్రత్యర్థులు. చంద్రబాబు ఏలుబడిలో ఒక్క జగనే గొంతెత్తి వాదించేవారు. బీజేపీ, జనసేన మిత్రులుగా ఉండేవారు. కాంగ్రెస్, వామపక్షాల సౌండ్ కూడా నాడు పెద్దగా వినిపించేది కాదు. అదే జగన్ ముఖ్యమంత్రి అనేసరికి మొత్తానికి మొత్తం విపక్షం ఏకమైపోయింది. ఇక వ్యవస్థలతో కూడా జగన్ సర్కార్ నిత్య పోరాటం చేయడం విధి విచిత్రమే. ఏపీలో ఎన్నడూ లేని విధంగా నిమ్మగడ్డ రమేష్ కుమార్ కి ప్రభుత్వానికి మధ్య అతి పెద్ద సమరమే సాగుతోంది. రెండు రాజ్యాంగబద్ధమైన సంస్థల మధ్యన ఉండాల్సింది సహకారం, అహంకారం కానే కాదు. మన రాజ్యాంగ నిర్మాతలు చెప్పింది ఇదే. కానీ ఏపీలో మాత్రం సీన్ వేరుగా ఉంది. అన్నీ తానే అంతా తానే అన్నట్లుగా ఎన్నికల సంఘం వ్యవహరిస్తోంది. ఎన్నికలు ఎపుడు పెట్టాలి. వాయిదా వేయాలి అన్నది పూర్తిగా తన ఇష్టం అన్నట్లుగా నిమ్మగడ్డ రమేష్ కుమార్ వ్యవహరిస్తున్నారని అని వైసీపీ నేతలు గుస్సా అవుతున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీకి మంట పుట్టించే మరో వార్త ఇపుడు ప్రచారంలో ఉంది. అదెంతవరకూ నిజమో కానీ జరిగితే మాత్రం వైసీపీకి నిమ్మగడ్డ రమేష్ కుమార్ చుక్కలు చూపించడం ఖాయమని అంటున్నారు. నిమ్మగడ్డ రమేష్ కుమార్ పదవీ కాలం ఎంతవరకూ అంటే అంతా చెప్పే మాట ఈ ఏడాది మార్చి 31తో సరి అని. కానీ ఇపుడు మరింతకాలం తన పదవీకాలాన్ని పొడిగించుకోవడానికి నిమ్మగడ్డ రమేష్ కుమార్ ప్రయత్నాలు చేస్తున్నారు అన్న ప్రచారం వైసీపీ శిబిరాన్ని కలవరపెడుతోంది. దానికి గల కారణాలు. ఆధారాలతో సహా ఆయన మరో తడవ కోర్టు మెట్లు ఎక్కుతారని కూడా అంటున్నారు. అదేంటి అంటే గత ఏడాది నిమ్మగడ్డ రమేష్ కుమార్ ను అకారణంగా దించేసి చెన్నైకి చెందిన కనగరాజ్ ని రాత్రికి రాత్రి వైసీపీ సర్కార్ ఎస్ ఈసీ కుర్చీలో కూర్చోబెట్టింది. దాని మీద నిమ్మగడ్డ ఎంతో పోరాటం చేస్తే తప్ప తిరిగి కుర్చీ దక్కలేదు. ఆ విధంగా ఆయనకు మూడు నెలల పదవీ కాలం నష్టం జరిగింది అని లెక్క తేల్చుతున్నారు. ఇక నిమ్మగడ్డ రమేష్ కుమార్ పంతం చూస్తే ఏపీలో పంచాయతీ ఎన్నికలతో మొదలుపెట్టి ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మునిసిపాలిటీల ఎన్నికలను కూడా నిర్వహించి కానీ రిటైర్ కాను అని చెబుతున్నారులా ఉందంటున్నారు. అందుకోసం ఆయన మరో మూడు నెలల గడువుని కోర్టు నుంచి కోరి మరీ తెచ్చుకుంటారని అంటున్నారు. గత ప్రభుత్వం చేసిన నిర్వాకం మూలంగా తన పదవిలో మూడు నెలల విలువైన టైమ్ కోత పడింది కాబట్టి దానికి బదులుగా తనను మరో మూడు నెలలు కొనసాగించాలని నిమ్మగడ్డ రమేష్ కుమార్ కనుక కోర్టుకు వెళ్తే తీర్పు ఎలా వస్తుందో మరి. ఆయనకు అనుకూలంగా వస్తే మాత్రం అనుకున్నట్లుగా అన్ని స్థానిక ఎన్నికలు నిర్వహించడం ఖాయమే. ఇది వైసీపీకి భారీ షాకే మరి.

ప్రజాపాలన

సంపాదకీయం

బుధవారం 13, జనవరి 2020

# అత్యంత అభివృద్ధి నిరోధక ప్రభుత్వమిది

అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అంటే భయపడి వణికిపోయే ప్రభుత్వాలలో ముందు వరుసలో ఉండేది మోడీ ప్రభుత్వమే. అదే సమయంలో శ్రామిక ప్రజల పట్ల అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వాల్లోనూ మోడీ ప్రభుత్వానిదే ప్రథమ స్థానం. ఈ రెండు లక్షణాలూ ఒకే నాణేనికి బొమ్మ, బొరుసు లాంటివి. కరోనా మహమ్మారి కాలంలో మోడీ ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధానం ఈ రెండు లక్షణాలనూ పూర్తిగా ప్రదర్శించింది. కరోనా కారణంగా ఆదాయ వనరులు కోల్పోయిన ప్రజానీకానికి సంపన్న దేశాల ప్రభుత్వాలన్నీ సహాయం పేర ప్రత్యేక ప్యాకేజీలు అందించాయి. చివరికి డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం కూడా ఆ దేశ జిడిపిలో 10 శాతం ప్యాకేజీగా ఇచ్చింది. కొన్ని నెలలపాటు ప్రతీ ఇంటికీ నగదు బదిలీ చేసింది. మన దేశంలో దాదాపు అన్ని ప్రతిపక్ష పార్టీలు, ఆర్థికవేత్తలు, పౌర సమాజంలోని వివిధ సంస్థలు, సంఘాలు ఒకే మాటగా ఆదాయపు పన్ను పరిధిలోకి రాని ప్రతి ఇంటికీ తలా రూ.7,000 చొప్పున నెలకు సహాయం అందించమని కోరినప్పటికీ ప్రభుత్వం అటువంటిదేమీ చేయనేలేదు. కొన్ని ప్రత్యేక సమూహాలకు మాత్రం నామమాత్రం సహాయాన్ని ప్రకటించారు. అయితే, అది కూడా వారికెవరికీ ఇంతవరకూ దక్కిన దాఖలాలు లేవు. ఈ కరోనా మహమ్మారి విజృంభణతో అంతకు ముందు పనులు చేసుకునేవారిలో దాదాపు నాలుగో వంతు తమ పనులను కోల్పోయారు. ఎటవంటి ఆదాయమూ లేక నిరాధారంగా మిగిలారు. కాని ఈ ప్రభుత్వం వారికేసి కన్నెత్తి చూడలేదు. అయితే ప్రభుత్వానికి అందుబాటులో ఉన్న, తేలికగా వినియోగించగలిగిన వనరులు కావలిసినన్ని ఉన్నాయి. మామూలుగా ప్రభుత్వం దగ్గర నిల్వ ఉండవలసిన ఆహార ధాన్యాల కన్నా నాలుగు రెట్లు నిల్వలున్నాయి. ఆ 10 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలతోబాటు ఇటీవలి కాలంలో ఎప్పుడూ పెరగనంతగా విదేశీ మారకపు నిల్వలు ఈ కాలంలో పెరిగాయి. నిరుపయోగంగా ఉన్న ఈ ధన, ధాన్యాల నిల్వలు ఒకవైపు, నిరుద్యోగం, దారిద్ర్యం దుర్భర స్థితికి చేరుకున్న వైనం ఇంకొకవైపు ఉన్నాయి. ఆర్థిక శాస్త్రం ఏమాత్రం తెలిసివున్న వారెవరైనా ప్రభుత్వం ఇటువంటి సమయాల్లో మరింత ఎక్కువగా ఖర్చు చేయాలనే చెప్తారు. వనరులను నిరుపయోగంగా ఉంచడం శుద్ధ తప్పనే అంటారు. కాని మోడీ ప్రభుత్వం మాత్రం అలా చేయనేలేదు. 2020 మార్చి నాటికి 47,700 కోట్ల డాలర్ల విదేశీ మారకపు నిల్వలుంటే డిసెంబరు 2020 నాటికి అవి కాస్తా 58,000 కోట్లకు పెరిగాయి. దీనికి కారణమేమిటి? సంపన్న దేశాలలో గణనీయమైన స్థాయిలో సహాయ ప్యాకేజీలను అమలు చేశారు. దానివలన ఆయా దేశాలలో ద్రవ్యలోటు పెరిగింది. ఈ లోటును పూడ్చడానికి అదనంగా కరెన్సీని ముద్రించారు. మరోవైపు ఆ డబ్బును దాచుకోవడం వలన ఎటువంటి వడ్డీ రాకుండా వడ్డీ రేట్లను చాలా తక్కువ స్థాయిలో కుదించారు. దీనివలన మార్కెట్లో డబ్బు ప్రవాహం పెరిగింది. ఎక్కడ ఆ డబ్బును పెడితే లాభం వస్తుందా అని ప్రపంచమంతటా వారు గాలించారు. సంపన్న దేశాలతో పోల్చితే భారత దేశంలో వడ్డీ రేట్లు ఎక్కువ. అందుచేత మన దేశంలోకి పెట్టుబడుల రాక ఈ కాలంలో పెరిగింది. మన రిజర్వు బ్యాంకు వాటిని విదేశీ మారకపు నిల్వలకు అదనంగా తోడు చేస్తూ పోతోంది. సంపన్న దేశాలు ఈ సంక్షోభ కాలంలో డబ్బు ప్రవాహాన్ని ప్రపంచవ్యాప్తంగా పెంచాలని ప్రయత్నిస్తున్న ఈ సమయంలో మన ప్రభుత్వం ఈ పరిస్థితిని ఉపయోగించుకుని ప్రభుత్వ వ్యయాన్ని పెంచి వుండాల్సింది. కాని మోడీ ప్రభుత్వం అలా చేయలేదు. విదేశీ మారకపు నిల్వలను ఊరికే పోగేసుకుంటూ వుంది. అంతే. ఈ విషయంపై ప్రభుత్వ ప్రతినిధుల వాదనలు వేరుగా ఉంటాయి. ప్రభుత్వం విదేశీ మారకపు నిల్వలను వినియోగించడమంటే దిగుమతులను పెంచాలి. ఆ దిగుమతులు చెల్లుబాటు కావాలంటే ప్రభుత్వ వ్యయం పెంచి ప్రజల ఆదాయాలు పెంచాలి. ప్రభుత్వ వ్యయం పెరిగితే ద్రవ్యలోటు పెరుగుతుంది. ద్రవ్యలోటు పెరిగినందువలన మారకం రేటు పడిపోయి మన దేశం నుండి ఎప్పుడైనా హఠాత్తుగా విదేశీ పెట్టుబడులు బైటకు తరలిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. అప్పుడు తప్పనిసరి అవసరాల కోసం కూడా విదేశీ మారక ద్రవ్యం లేకుండా పోతుంది. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది. ఇదీ ప్రభుత్వం తరఫున వకాల్తా పుచ్చుకున్నవారి వాదన. అయితే హఠాత్తుగా విదేశీ నిల్వలు తరలిపోతాయేమోనన్న భయంతో మొత్తం ఆ నిల్వలన్నింటినీ ఊరికే, ఏ విధంగానూ ఉపయోగించకుండా అట్టిపెట్టుకుంటే మన దేశం విదేశీ నిల్వలను భద్రపరిచే కేంద్రంగా మిగిలిపోతుంది. అవి రిజర్వుగా అట్టిపెట్టినందున వచ్చే వడ్డీ కన్నా మనం ఆ సొమ్ము పంపిన వారికి చెల్లించాల్సి వచ్చే వడ్డీ ఎక్కువ. ఇది ఎలాటిదంటే ఒక బ్యాంకు తన వద్ద డబ్బు డిపాజిట్ చేయడానికి వచ్చిన వారినుండి వచ్చిన సొమ్ము మొత్తాన్ని ఎవరికీ అప్పులివ్వకుండా మొత్తంగా తనవద్దనే అట్టిపెట్టుకుందనుకోండి. అప్పుడా బ్యాంకు పరిస్థితి ఏమవుతుంది? విదేశీ నిల్వల విషయంలో వాటిని ఏమీ వినియోగించకుండా ఊరికే ఉంచితే దేశం పరిస్థితీ అంతే. మన దేశానికి వచ్చిన విదేశీ నిల్వలలో ఒక సగం దాచిపెట్టి తక్కిన సగాన్ని ఖర్చు చేస్తే ఏమవుతుంది? ఒక లెక్క వేసి చూద్దాం. మార్చి నెలాఖరు నుండి డిసెంబరు నెలాఖరు వరకు మధ్య కాలంలో మన దేశంలోకి వచ్చిన విదేశీ నిల్వల విలువ రూ. 6.7 లక్షల కోట్లు. దీనిలో సగాన్ని, అంటే రూ. 3.35 లక్షల కోట్లు-విదేశాల నుండి దిగుమతుల కోసం ఖర్చు చేశామనుకుందాం. అలా దిగుమతి అయిన సరుకుల వలన మన దేశంలో జిడిపి పెరుగుతుంది. మన జిడిపిలో దిగుమతుల శాతం 15. ఆ లెక్కన చూసినప్పుడు దిగుమతులు రూ. 3.35 లక్షల కోట్లు పెరిగితే జిడిపి రూ. 22 లక్షల కోట్లు పెరుగుతుంది. ప్రభుత్వం ఒక రూపాయి ఖర్చుపెడితే అది మార్కెట్‌లో రెట్టింపు డిమాండ్‌ను సృష్టిస్తుంది (ఉదాహరణకు-రూ. 7000 ఒక కుటుంబానికి ప్రభుత్వం సహాయం చేసిందనుకోండి. ఆ సొమ్ముతో ఆ కుటుంబం సరుకులు కొంటుంది. ఆ మేరకు మార్కెట్లో అదనంగా సరుకులకు డిమాండ్ పెరుగుతుంది. తిరిగి ఆ మేరకు సరుకులు తయారు చేయడానికి పెట్టుబడి వస్తుంది. వాటిని తయారు చేసే కార్మికుడికి ఆ మేరకు జీతం వస్తుంది. ఆ జీతంతో అతడు మళ్ళీ సరుకులు కొంటాడు. ఇలా ప్రభుత్వ ఖర్చుకి కనీసం రెట్టింపు డిమాండ్ ఏర్పడుతుంది). ఇప్పుడు పెరిగిన జిడిపి రూ. 22 లక్షల కోట్లను అందుకోడానికి ప్రభుత్వం రూ. 11 లక్షల కోట్ల అదనపు వ్యయం చేస్తే చాలు. ప్రభుత్వం రూ. 11 లక్షల కోట్లు అదనంగా ఖర్చు చేస్తే జిడిపి రూ. 22 లక్షల కోట్లు పెరుగుతుంది. ఈ క్రమంలో ప్రభుత్వానికి అదనంగా పన్నుల రూపంలో రూ. 3.3 లక్షల కోట్లు సమకూరుతుంది (జిడిపి-పన్నుల ఆదాయం నిష్పత్తి 15 శాతం జుమారుగా ఉంటుంది). అంటే ఇక ప్రభుత్వం అదనంగా రూ. 7.7 లక్షల కోట్ల ద్రవ్యలోటుకు సిద్ధపడాలన్నమాట (మొత్తం అదనపు వ్యయం రూ. 11 లక్షల కోట్లు-పన్నుల ద్వారా ఆదాయం రూ. 3.3 లక్షల కోట్లూ రూ.7.7 లక్షల కోట్లు). ఇది 2019-20 జిడిపిలో 3.5 శాతం. ఇప్పుడు బడ్జెట్‌లో నిర్ణయించిన ద్రవ్యలోటు 4 శాతానికి ఈ 3.5 శాతాన్ని కూడా కలిపితే మొత్తం ద్రవ్యలోటు అప్పుడు 7.5 శాతం అవుతుంది. ఈ లెక్క చాలా ఎక్కువ జాగ్రత్తలు తీసుకుని వేసినది. చాలామంది మన ద్రవ్య లోటు 12 శాతం దాకా పెంచడం మంచిదని వాదిస్తున్నారు. ఇక్కడ మనం పరిగణన లోకి తీసుకోవలసిన అంశం ద్రవ్యలోటును ఎంతవరకూ పెంచుకోవచ్చునన్నది కాదు. అసలు మోడీ ప్రభుత్వం అదనపు ప్రభుత్వ వ్యయాన్ని ఏ మేరకైనా సరే చేపడుతుందా లేదా అన్నదే అసలు విషయం. ఈ ప్రభుత్వం అటువంటి అదనపు వ్యయాన్ని పిసరంతైనా చేయడానికి సిద్ధపడలేదు. కేవలం నాలుగు గంటల నోటీసు ఇచ్చి అత్యంత క్రూరమైన, నిరుపయోగమైన లాక్‌డౌన్‌ను మాత్రం అత్యంత నిర్లక్ష్యపూరితంగా ప్రకటించింది. తాను చాలా తేలికగా ప్రజలకు సహాయం అందించగలిగినప్పటికీ ఏ సహాయమూ అందించలేదు. కోట్లాది శ్రమజీవులు దీని ఫలితంగా పనులను, ఆదాయాలను కోల్పోయారు. ఈ ప్రభుత్వం ఎందుకు ఈ విధంగా చేసింది? కేవలం అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి విధించిన ద్రవ్యలోటు హద్దులను దాటే ధైర్యం లేనందువల్లనే, తన పిరికితనం వల్లనే మోడీ ప్రభుత్వం ఈ విధంగా చేసింది. ఎఫ్‌ఆర్‌బిఎం చట్టం ఈ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిని సంతృప్తి పరిచేందుకే చేశారు. కేంద్ర ప్రభుత్వానికి 3 శాతం ద్రవ్యలోటు పరిమితిని ఆ చట్టం విధించింది. ఇదే తరహా చట్టాలు ఇతర దేశాలలోనూ ఉన్నాయి. కాని ఆ ప్రభుత్వాలు కరోనా మహమ్మారిని కారణంగా చూపించి తమ ద్రవ్యలోటు పరిమితులను అధిగమించి ఖర్చు చేశాయి. ఆ విధంగా చూపించి ఖర్చు చేయగలిగే ధైర్యం మన ప్రభుత్వానికి లేకపోయింది. కనీసం ప్రజలు పడుతున్న తీవ్రమైన బాధలు కూడా ఈ ప్రభుత్వాన్ని కాస్తంతైనా కదిలించలేకపోయాయి. ప్రజలకూ, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికీ మధ్య ఈ మహమ్మారి కాలంలో తలెత్తిన వైరుధ్యంలో ప్రభుత్వం ప్రజల వైపున నిలవకుండా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి వైపున నిలబడింది. కనీసం ఒక నిరసన కూడా తెలపలేదు.

మోడీ ప్రభుత్వ నిర్లక్షం అక్కడితో ఆగలేదు. ఏ ప్రజాస్వామ్య దేశంలోనైనా అధికార పార్టీ ప్రజలను పట్టించుకోకపోతే ఎన్నికల్లో ఓటమిపాలౌతానన్న భయంతో ఉంటుంది. సంపన్న దేశాల ప్రభుత్వాలు, చివరికి డొనాల్డ్ ట్రంప్ తో సహా, అందుకే తమ తమ ప్రజలకు గణనీయంగా సహాయ ప్యాకేజీలు అందించారు. వారికి ఏదో ప్రజలపై చాలా ప్రేమ ఉండినందువల్ల కాదు. ప్రజాస్వామ్య వ్యవస్థల ఒత్తిళ్ల వలన ఆ విధంగా చేశారు. కాని మోడీ ప్రభుత్వం ఆవిధంగా కూడా చేయలేదు. అంటే ఈ ప్రభుత్వానికి ప్రజాస్వామ్య వ్యవస్థలంటే ఏమాత్రమూ లెక్కలేదు. సరిగ్గా సమయం చూసి ఏదోవిధంగా హిందూత్వ ఎజెండాను ముందుకు తేవడం, ఎన్నికల ముందు, తర్వాత ప్రతిపక్ష పార్టీల నుండి ఫిరాయింపులను ప్రోత్సహించడం, అందుకు విపరీతంగా డబ్బును ఉపయోగించడం బిజెపి బాగా నేర్చింది. మత విద్వేషాలను రెచ్చగొట్టి రక్తపుటేరులను పారించడానికి అదేమీ వెనుకాడదు. రాజకీయాన్ని ఎంతగా ఒక సరుకుగా మార్చిందంటే ప్రజలు ఎవరికి ఓటు చేసినా, గెల్చిన వారిని కొనుగోలు చేసి ప్రభుత్వాన్ని మాత్రం ఆ పార్టీయే ఏర్పాటు చేస్తోంది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిని ఎదుర్కోలేని పిరికితనం, ప్రజల పట్ల నిర్లక్ష్య వైఖరి, బాధ్యతా రాహిత్యం, ఎన్నికలను తొత్తడం చేసి ప్రజాస్వామ్యాన్నే అపహాస్యం చేయడం-ఈ లక్షణాలతో మోడీ ప్రభుత్వం ప్రపంచంలోకెల్లా అత్యంత మితవాద, అభివృద్ధి నిరోధక ప్రభుత్వంగా ఉందని చెప్పాలి.

## వ్యాస ధార, ఉపన్యాస ఝరి

తెలుగు పాత్రికేయ, సాహిత్య, సాంస్కృతిక చిహ్నం 'తుర్లపాటి'గా ప్రసిద్ధుడైన తుర్లపాటి కుటుంబరావుకు తెలియనివారు లేరు, ఆయన తెలియని వారు లేరు. చిన్ననాడే మహాత్మాగాంధీని కలుసుకుని, గాంధీజీ ఆటోగ్రాఫ్‌ను సంపాయించిన ఘనుడు. విద్యార్థి దశ నుంచే రచన, ప్రసంగాలలో దిట్ట. నార్ల వెంకటేశ్వరరావు గారే తనకు స్ఫూర్తి అని చెప్పేవారు. నాకు ఆయనతో సుమారు రెండు దశాబ్దాల సహ ప్రయాణం, చనువు. గంభీరమైన చమత్కారంతో దాదాపు 18000 సభలకు అధ్యక్షునిగా వ్యవహరించిన, అసమాన అనుభవజ్ఞుడు. అప్పుడప్పుడూ ఆయన చెప్పే విషయాలు, ఆయన పసిమనస్సును మాకు పరిచయం చేసేవి. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వద్ద పిఏగా పని చేసినప్పుడు టంగుటూరి సూర్యకుమారి గారితో వివాహ ప్రతిపాదన వచ్చిందని, తానే అంగీకరించలేదని తుర్లపాటి చెప్పారు. ఆనాటికే ప్రముఖ నర్తకైన కృష్ణకుమారే 20%--%30 గంటల రైలు ప్రయాణంలో ముందు ప్రేమించి, తర్వాత ప్రతిపాదించి వివాహం కోరేలా చేసుకోగలిగిన అందమైన గడుసరి తుర్లపాటి. ఆమెతో ఆనాడు పాడించుకున్న మల్లీశ్వరిలోని 'మనసున మల్లెల మాలలూగెనే' ఈనాటికీ ఆయన ఫేవరెట్ సాంగ్. 14 సంవత్సరాల వయస్సులో 'స్వరాజ్యంలో స్వరాష్ట్రం' అన్న శీర్షికతో 'మాతృ భూమి' అనే రాజకీయ వారపత్రికతో మొదలైన తుర్లపాటి రచనా ప్రవాహం, ఎన్‌జి రంగా నిర్వహించిన 'వాహిని'కి సహసంపాదకత్వంతోబీ చలసాని రామారావు నిర్వహించిన 'ప్రతిభ'కు సంపాదకత్వంతో సాగి, ప్రకాశం పంతులు గారి 'ప్రజా పత్రిక'లో ఆంధ్రప్రాంత సంపాదకుని స్థాయికి చేర్చింది. తరువాత టీవీయస్ చలపతిరావు సారథ్యంలోని 'ప్రజాసేవ' పత్రికలో పనిచేశారు. 'ఆంధ్రజ్యోతి'లో 1991 వరకూ కొన సాగారు. నాటి నుంచి నేటి వరకు స్వేచ్ఛా పాత్రికేయునిగా వ్యవహరించిన తుర్లపాటి ఆదర్శప్రాయమైన వృత్తి నిబద్ధత శ్లాఘనీయమైనది. ఆంధ్రజ్యోతిలోనూ, వార్తలోనూ 50 సంవత్సరాలపాటు ఆయన అందించిన 'వార్తలలోని వ్యక్తి' అనే శీర్షిక ప్రపంచ రికార్డు. 4000 మంది ప్రముఖుల జీవిత రేఖాచిత్రాలు, ఎంతో జ్ఞాపకశక్తి, పరిశోధన, పరిచయాలతో శీర్షిక నిర్వహించడం అనితర సాధ్యం. తెలుగును, తెలుగువారినీ ఏ మాత్రం చులకన చేసినా ఆయన నిర్భయంగా కలం ఝుళిపించేవారు. మన దేశానికి, మన రాష్ట్రానికి ఏ చిన్న అసౌకర్యం కలిగినా ఆయన రాతలు, మాటలు అనివార్యంగా ప్రభుత్వానికి లేఖల రూపంలో సంధింపబడేవి, అవి పరిష్కరింపబడేవి. కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యునిగా, ఫిలిం ఫ్యాన్స్ అసోసియేషన్ అవార్డు ప్రదానోత్సవాల వ్యాఖ్యాతగా ఆయన అద్భుతంగా రాణించారు. అక్కినేనికి అన్నింటికన్నా ఇష్టమైన 'నటసమ్రాట్' బిరుదు ఆయన ఇచ్చిందే. వేదిక మీద ఎన్‌టిఆర్ ఉన్నప్పుడు 'ఈ తెలుగు చలనచిత్ర సీమలో ఎన్‌టిఆర్‌ని మించిన నటుడు ఒక్కరే' అన్నాడు. ఇక నిర్వాహకుల కం గారు, ఎన్‌టిఆర్ కోపం, ప్రేక్షకుల నిరసనలు అవధులు దాటాయట. ఒక్కనిముషం ఆగి, 'ఎన్‌టిఆర్‌ని మించిన నటుడు ఎన్‌టీఆరే' అని అనగానే అయిదు నిముషాల చప్పట్లు, ఎన్‌టీఆర్ చిరునవ్వు దొరికాయని చెప్పారు. పద్మశ్రీ పురస్కారం పొందిన మొదటి... బహుశా ఒకే ఒక తెలుగు పాత్రికేయుడు తుర్లపాటి. విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షునిగా ఆయన సరళి ముఖ్యమంత్రి చెన్నారెడ్డిని ముగ్ధుణ్ణి చేసింది. పలు విషయాలపై ఆయన చేసిన సూచనలు విజయభాస్కర్ రెడ్డిని, వైయస్ రాజశేఖర్ రెడ్డిని ఆకర్షించి, తుర్లపాటికి శాసనమండలి సభ్యత్వం ప్రతిపాదించారు కానీ చివరి నిమిషంలో మార్పులు జరిగాయి. రోశయ్యగారి హయాంలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ అధ్యక్షునిగా తుర్లపాటిని నియమించారు. (సుమారు అయిదు సంవత్సరాల కాలానికి అనుకుంటాను.) నేను ఆనాటి నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ మాజీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ శాశ్వత అధ్యక్షుడు అని చమత్కరించేవాడిని. అంత అందంగా ఉండేవారాయన.

# చరిత్ర తెలియకపోతే...!

'చరిత్ర తెలియనివాళ్లు చరిత్ర నిర్మించలేర'ని స్వతంత్ర భారత రాజ్యాంగ రచనలో కీలక పాత్ర నిర్వహించిన అంబేద్కర్ అన్నారు. ఆయన మహా మేధావి, న్యాయశాస్త్ర నిష్ణాతుడు. ఆయన మాటలు అక్షర సత్యాలు. నిజమే-చరిత్ర తెలియని వాళ్లు సరికొత్త చరిత్ర నిర్మించలేరు. గత చరిత్రను మార్చడానికి కంకణబద్ధులైన కొందరు పెద్దలు ఒక మతానికి చెందిన వారందరూ దేశభక్తులని అంటున్నారు! దేశ భక్తికి, మతానికీ ముడిపెట్టడమే అసమంజసం. బహుశా వీరికి ఇటీవలి చరిత్ర సైతం తెలియదని, తెలిసినా ఆ కళంక, కల్మష ఏీాన చ్రిత్రన మరుగుపరచాలనుకుంటున్నారని అన్పిస్తున్నది. మన దేశ చరిత్రలో ద్రోహం, మిత్రద్రోహం, బంధుద్రోహం గురించి తెలుసుకోవడానికి కృతయుగం, త్రేతాయుగాల వరకు వెళ్లి చరిత్ర గర్భాన్ని ఛేదించి, శోధించవలసిన అవసరంలేదు. పృథ్వీరాజ్ చౌహాన్, జయచంద్రుల (అల్లుడు, మామ) దగ్గర మొదలు పెట్టితే చాలు. 1857లో, ప్రథమ భారత స్వాతంత్ర్యసమరంలో పరాజయం పాలు కావడానికి ప్రధాన కారణం ఆంగ్లేయుల బలం కాదు, కొందరి దేశభక్తి రాహిత్యం, దేశద్రోహం. తర్వాత మరో 90ఏండ్లు ఈ 'హిందుస్థాన్'లో ఆంగ్లేయ పాలన కొనసాగి, స్థిరపడడానికి, ఈ దేశం మూల్గులను పీల్చడానికి ప్రధాన కారణాలు మన అనైక్యత. పరస్పర ద్వేషం. ముఖ్యంగా ద్రోహబుద్ధి, దేశభక్తి లోపించడం. స్వాతంత్ర్యానంతరం నాయకులుగా చలామణి అయిన వారు కొందరు (ఉన్నత పదవులలో కూడా కూర్చున్నవారు!) బ్రిటిష్ పాలనలో పాలకుల తొత్తులుగా వ్యవహరించి పోలీసు స్టేషన్లలో క్షమార్పణ పత్రాలు రాసి ఇచ్చారు. ఈ రాసిన వారిలో కొందరు పెద్దలున్నారని చరిత్ర చదివితే తెలుస్తుంది. అంబేద్కర్ కోరింది ఇదే. 'సారేజహాసె అచ్ఛా హిందూస్తాన్ హమారా..' గీతం రాసింది హిందువు కాదు! 1965లో పాకిస్థాన్‌తో యుద్ధం జరిగినప్పుడు పాక్ పాటన్ టాంక్ పై ప్రాణాన్ని లెక్కచేయకుండా ఎక్కి దాన్ని ధ్వంసం చేసి, యుద్ధ రంగంలో హిందుస్థాన్ గౌరవాన్ని ఇనుమడింప జేసింది హిందూ సైనికుడు కాదు. నేతాజీ ఆజాద్ హింద్ ఫౌజ్‌లో ప్రముఖ సేనానులందరూ హిందువులు కాదు. స్వాతంత్ర్య ప్రదాత, జాతిపిత గాంధీజీని (ఒక నైష్టిక హిందువును) ఒక ప్రార్థనా సమావేశంలో హత్య చేసింది ఒక మతోన్మాది. అలాంటి ఉన్మాదికి ఒక మతాన్ని ఆపాదించలేం. దేశ ప్రజలు అనాదినుంచి సంస్కరణలను, అవి ఏ రూపం లో ఉన్నప్పటికి వాటిని ఆహ్వానించారు. సంస్కర్తలను ప్రజలు చిత్తశుద్ధితో అనుసరించారు. సనాతన హిందూమతంలో, ధర్మంలో వచ్చినన్ని సంస్కరణలు బహుశ ఇంకే మతంలోను రాలేదేమో. క్రీస్తుకు పూర్వం 500 ఏండ్ల కిందటనే మహావీరుడు, గౌతమబుద్ధుడు అంధ విశ్వాసాలను, దుష్ట సంప్రదాయాలను వ్యతిరేకించి జైన, బౌద్ధ మతాలను సృష్టించారు. ఆధునిక చరిత్రలో, 19వ శతాబ్ది ఆరంభంలో రాజా రామ్‌మోహన్ రాయ్ బ్రహ్మసమాజాన్ని, దయానంద సరస్వతి ఆర్య సమాజాన్ని సంస్కరణ ఉద్యమాలుగా ప్రారంభించారు. క్రీస్తుశకం 8వ శతాబ్దంలో ఆదిశంకరాచార్యులు, 11వ శతాబ్దంలో భగవద్రామానుజులు హైందవ మతంలో గొప్ప సంస్కర్తలు. ఈ మహా ప్రవక్తల సంస్కరణలు మహత్తర సామాజిక ప్రోగ్వనానికి దోహదపడ్డాయి. పూర్వపు హైదరాబాద్ సంస్థానంలో వ్యవసాయ మార్కెట్ కమిటీల ఏర్పాటు సంస్కరణలే. విముక్తి అనంతరం హైదరాబాద్ రాష్ట్రంలో మొదటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు వ్యవసాయ కౌలుదారుల హక్కుల పరిరక్షణ కోసం చేసిన చట్టం చరిత్రాత్మకమైనది. భూస్వాములు మినహా ఇతరులెవరూ ఈ చట్టాన్ని వ్యతిరేకించలేదు. స్వతంత్ర భారతంలో వచ్చిన మొదటి వ్యవసాయక విప్లవకర చట్టం ఇది. వ్యవసాయ రంగంలో సమగ్ర, మౌలిక సంస్కరణల నిమిత్తం పి.వి. నరసింహారావు ముఖ్యమంత్రిగా భూ గరిష్ఠ పరిమితి చట్టాన్ని 50 ఏండ్ల కిందట ప్రవేశ పెట్టి సంచలనం సృష్టించారు. వ్యవసాయ రంగంలో సంస్కరణల కోసం తహతహలాడుతున్న వారందరు పీవీ భూసంస్కరణల చట్టాన్ని



హృదయపూర్వకంగా ఆహ్వానించారు. పీవీ భూసంస్కరణల చట్టంపై ఆయనకు సన్నిహితుడైన ప్రముఖ న్యాయవాది, రాజకీయ నాయకుడు ఇ. అయ్యపురెడ్డి ఒక సమగ్ర విశ్లేషణ, వ్యాఖ్యాన గ్రంథం రచించారు. ఇంగ్లీషులో అది చాల పెద్ద గ్రంథం. దాన్ని నేను వెంటనే సరళ భాషలో, ప్రామాణికంగా తెలుగులోనికి అనువదించాలని అయ్యపురెడ్డి పట్టుపట్టారు. నేను తెలుగులోకి అనువదించిన గ్రంథం ప్రచురితమైంది. దాని కాపీల కోసం అన్ని వర్గాల వారు, విశేషించి వ్యవసాయదారులు, రైతులు క్యూలలో నిలిచారు. పీవీ భూసంస్కరణలకు లభించినట్లే ఆయన వివిధ శాఖల మంత్రిగా ఉన్నప్పుడు తెచ్చిన వివిధ సంస్కరణలకు అపూర్వ ఆదరణ లభించింది. తర్వాత కేంద్రమంత్రిగా అమలు జరిపిన విద్యావిధాన సంస్కరణలకు, ప్రధానిగా ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలకు దేశ ప్రజల ఏకగ్రీవ ఆమోదం లభించింది. పీవీ ఆర్థిక సంస్కరణలు భావిభారతానికి మార్గదర్శకమైనవి. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్ గత ఆరేండ్లలో విద్యుత్, జల వినియోగం తదితర రంగాల్లో ప్రవేశపెట్టిన పథకాలు, కార్యక్రమాలన్నీ అపూర్వ సంస్కరణలు. ఈ పథకాలన్నీ రాష్ట్ర ప్రజల అఖండ హర్షామోదాలను పొందడం విశేషం. కేంద్రప్రభుత్వపు ఇటీవలి వ్యవసాయ బిల్లులు దేశప్రజల తీవ్ర వ్యతిరేకతకు గురి కావడం విచిత్రం. ఆధునిక చరిత్రలో, 19వ శతాబ్ది ఆరంభంలో రాజా రామ్‌మోహన్ రాయ్ బ్రహ్మసమాజాన్ని, దయానంద సరస్వతి ఆర్య సమాజాన్ని సంస్కరణ ఉద్యమాలుగా ప్రారంభించారు. క్రీస్తుశకం 8వ శతాబ్దంలో ఆదిశంకరాచార్యులు, 11వ శతాబ్దంలో భగవద్రామానుజులు హైందవ మతంలో గొప్ప సంస్కర్తలు.

# బీజేవైఎం ఆధ్వర్యంలో ఘనంగా స్వామి వివేకానంద పుట్టిన రోజు వేడుకలు

మధిర, జనవరి 12, ప్రజాపాలన :ఈరోజు బీజేవైఎం రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు జిల్లా పార్టీ పిలుపుమేరకు మధిర టౌన్ యువమోర్చా ఆధ్వర్యంలో స్వామి వివేకానంద యువజనోత్సవం సందర్భంగా 158 వ పుట్టినరోజు బీజేవైఎం టౌన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగినది ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా కార్యదర్శి కాసిన నాగ భూషణం బీజేవైఎం టౌన్ కమిటీ మిక్కిలినేని కృష్ణ ప్రధాన కార్యదర్శులు బియ్య వరపు రామకృష్ణ కొల్లా రఘురాం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగినది ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నాయకులు ఇరుకుల్ల నరసింహారావు గారు మాట్లాడుతూ యువత మేలుకో పదండి ముందుకు భావి భారత నిర్మాణానికి నాంది పలకండి అని వివేకానంద స్వామి చెప్పిన నినాదాన్ని యువత పాటించాలని యువత చెడు మార్గంలో కాకుండా సన్మార్గంలో ధర్మం కోసం పని చేయాలని వారిని స్ఫూర్తిగా తీసుకుని ఆదర్శవంతంగా మెలగాలని గుర్తు చేస్తూ వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పడం జరిగినది అదేవిధంగా రామిశెట్టి నాగేశ్వరావు గారు మాట్లాడుతూ విశ్వనాథ దత్తా భువనేశ్వరి గారి దంపతులకు 1863 జనవరి 12 వ తారీఖున స్వామి వివేకానంద సోమవారం కృష్ణసప్తమి ధనుర్ లగ్నం కన్య రాశి హస్త నక్షత్రం ఉదయం ఆరు గంటల 33 నిమిషాల 33 సెకండ్లకు మకర సంక్రాంతి పర్వదినం రోజున స్వామి వివేకానంద జన్మించినారు బాల్యంలోనే వికసించిన వ్యక్తిత్వం సర్వతోముఖ ప్రతిభతో అన్నింటికీ మించిన ఆత్మ అన్వేషణ కలిగిన వ్యక్తి స్వామి వివేకానంద వారు ప్రపంచంలోని యువత అందరూ ఆదర్శంగా తీసుకొని వారి అడుగుజాడలలో నడవాలని వారు సూచించిన మార్గంలో యువత ఆదర్శంగా తీర్చిదిద్దాలని ధర్మం కోసం దేశం కోసం దేశ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేయాలని సూచించడం జరిగింది ప్రార్థన మూలంగా జన్మించిన వ్యక్తే శ్రేష్టుడు అన్న స్వామీజీ వచనం ఆయన జీవితానికి వర్తిస్తుంది సర్వమత మహాసభ చికాగో కళా సంస్థలో హార్ట్ ఇనిస్టిట్యూట్లో 1893 సెప్టెంబర్ 11వ తేదీన స్వామి వివేకానంద మాట్లాడుతూ సోదర సోదరీమణులారా అని సంబోధించగానే అందరూ లేచి ఆనందంతో కరతాళధ్వనులు చేయడం జరిగింది ప్రపంచానికి హైందవ ధర్మం జీవన విధానాన్ని తెలియపరిచిన ఆ మహానుభావుడి అడుగుజాడల్లో ప్రపంచ యువకుల్లారా మేల్కొండి పదండి ముందుకు భవిష్యత్ కార్యాచరణ కోసం అని పిలుపు ఇవ్వడం జరిగింది అలాంటి మహనీయుల త్యాగాల స్ఫూర్తి నినాదాలు యువకులు ఆదర్శవంతంగా తీసుకుని నడవాలని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కోన నరసింహారావు కుంచం కృష్ణారావు గారు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకులు ఏబీవీపీ శివరాజు సుమంత్ తదితరులు పాల్గొనడం జరిగింది.





## భారతదేశం ఖ్యాతిని చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద

జగిత్యాల, జనవరి 12 (ప్రజాపాలన): జగిత్యాల టౌన్ భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని 45వ వార్డులో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జగిత్యాల జిల్లా ఆసుపత్రిలో భక్త మార్కండేయ యువజన సంఘం ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భోగ శ్రావణి స్థానిక కౌన్సిలర్లు శ్రీనివాస్ పిట్ట ధర్మరాజు తెరాస నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దెందుకూరు, చిలుకూరు ఉన్నత పాఠశాలల విద్యార్థుల కు ఉచిత మాస్కల పంపిణీ



మధిర, జనవరి 12, ప్రజాపాలన :Cipla ఫౌండేషన్ మరియు CSIR-IICT హైదరాబాద్ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ లిడాక్టర్ %ూ%. శ్రీధర్లి వారి సౌజన్యంతో కరోనా వ్యాప్తి అరికట్టటం లో భాగంగా దెందుకూరు, చిలుకూరు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మండల విద్యాశాఖాధికారి ప్రభాకర్లి గారి చేతుల మీదుగా మాస్క్ లను ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ మధిర ప్రాంత నిర్వాహకులు సంక్రాంతి శ్రీనివాసరావు,మేడేపల్లి శ్రీనివాసరావు లతో పాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు రావిరాల లక్షణరావు,రేణుక,లోవెల్ కుమార్, శేషయ్య, మాధవి, శరత్, పూట్ల శంకరరావు, %ఎ%. శ్రీనివాస్, సుధాకర్, కళావతి తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురైన వారికి మెరుగైన చికిత్స అందించాలి:జిల్లా కలెక్టర్ పౌసుమి బసు

వికారాబాద్ జిల్లా ప్రతినిధి జనవరి 12 ( ప్రజాపాలన ) : వికారాబాద్ నియోజకవర్గంలోని పెండ్లిమడుగు, ఎక్ మామిడి గ్రామాలలో మంగళవారం జిల్లా కలెక్టర్ పౌసుమి బసు సందర్శించి కల్తీ కల్లు సేవించి అస్వస్థతకు గురైన భాదితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అశ్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గ్రామాలలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అందరి ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేశారు. మృతి చెందిన వారికి అర్హత మేరకు అపద్బంధు కింద ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. ఏమైనా అత్యవసర పరిస్థితులు ఉంటే వెంటనే వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి బాధితులను పంపించాలని ఆసుపత్రిలో అవసరమైన బెడ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో వారం రోజుల పాటు మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. పండగ సందర్భంగా ఎవరు కల్లు సేవించి పొలాల వద్దకు వెళ్లి పడిపోకుండా పోలీస్ సిబ్బంది ఆయా గ్రామాలలో తప్పకుండ పెట్రోలింగ్ నిర్వహిస్తూ, పరిశీలిస్తూ ఉండాలన్నారు. ఈ సందర్భంగా గ్రామాలలోని కల్లు దుకాణాలు పరిశీలించారు. ఈ శనివారం వరకు సర్పంచ్, గ్రామ కార్యదర్శులు ఇంటింటికి తిరిగి పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని ఆదేశించారు. అనంతరం మూడు రోజులు గ్రామాలలో పారిశుధ్యం కార్యక్రమాలు చేపట్టవలసి ఉన్నందున, మురికి కాలువలను పరిశీలించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని గ్రామ సర్పంచ్, కార్యదర్శిని సూచించారు. ఎక్ మామిడి గ్రామంలో వైకుంఠ ధామం పనులను పరిశీలించారు. ఈనెల 31 వరకు పనులను పూర్తి చేయాలన్నారు. అవసరమైన సిమెంట్ 230 రూపాయలకు తీసుకొని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సర్పంచ్ కు ఆదేశించారు. పచ్చని మొక్కలు నాటి ఫెన్సింగ్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, ఎక్సైజ్ సూపరిం టెండెంట్ వరప్రసాద్, డాక్టర్ అరవింద్, డాక్టర్ ప్రసాద్ ఎంపీడీఓ సుభాషిణి, సుమిత్రమ్మ, ఎంపిపి కామిడి చంద్రకళ, పెండ్లి మడుగు సర్పంచ్ కెరెల్లి బుచ్చిరెడ్డి, గ్రామ కార్యదర్శులు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.





## నాణ్యత లేని సిసి రోడ్ల నిర్మాణం

**కాంగ్రెస్ నాయకుడు ఎర్రోల్ల రాజు**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జనవరి 12 ( ప్రజాపాలన ) : నాణ్యత ప్రమాణాలు పాటించకుండా సిసి రోడ్డు నిర్మాణం మూన్నాల్ల ముచ్చటగా మారిందని కాంగ్రెస్ నాయకుడు ఎర్రోల్ల రాజు ఆరోపించారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని గంగారం గ్రామానికి చెందిన 27వ వార్డు ప్రజలు దేవరాజ్, గౌరీశంకర్, బాబూరావు, దేవదాస్, మహమ్మద్ షరీఫ్, మహమ్మద్ ఉస్మాన్ లు రోడ్డు దుస్థితిని వివరించారు. గత రెండు నెలల కింద గంగారం బ్రిడ్జి నుండి పాఠశాల వరకు నిర్మించిన రోడ్డు టాప్ పూర్తిగా పాడయ్యిందని మీడియాతో చెప్పారు. కాంట్రాక్టర్ కాసుల కక్కుర్తితో డస్ట్ లో సిమెంట్ తక్కుగా వేసి నిర్మించడం వలన రోడ్డు పై భాగంలో కంకర తేలిందన్నారు. వాస్తవానికి సిసి రోడ్డు నిర్మించడానికి ఒక్క సిమెంటు బ్యాగ్ కు రెండు సిమెంటు సంచుల ఇసుక, మూడు సంచుల కంకర వాడాలని మున్సిపల్ ఏఈ రాయుడు తెలిపారు. రోడ్డు నిర్మాణంలో సిమెంటు తక్కువగా వేయడం వల్లనే పాడయ్యిందని అన్నారు. రోడ్డు నిర్మాణం చేసేటప్పుడు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే కాంట్రాక్టర్ తన ఇష్టం వచ్చినట్లు నిర్మించాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్ళపల్లి మంజుల రమేష్ వివరణ కోరగా సిసి రోడ్లు నిర్మాణం చేపట్టేటప్పుడు తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించడం జరిగిందన్నారు. ప్రతి విధిగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే వారికి చెల్లించాల్సిన బిల్లులు సక్రమంగా చెల్లిస్తామని అన్నారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించక పోతే వారికి నోటీసులు జారీ చేస్తామని వివరించారు. మళ్ళీ వారి చేతనే పునర్నిర్మాణం చేయించిన తరువాతనే బిల్లులు అందజేస్తామని వివరణ ఇచ్చారు.

## పాఠశాలల నిర్వహణ కోసం కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి:జిల్లా అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి



మంచిర్యాల జిల్లా ప్రతినిధి,జనవరి 12, ప్రజాపాలన :ఫిబ్రవరి 1వ తేదీ నుండి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కొవిడ్-19 దృష్ట్యా తగిన జాగ్రత్తలతో కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లుతో కలిసి జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభం అవుతున్న దృష్ట్యా కొవిడ్-19 నిబంధనల మేరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తరగతిలో సెక్షన్లు ఉన్నందున ఉపాధ్యాయులు అన్ని చూసుకోవాలని, జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత పాఠశాలలు, మున్సిపల్ అధికారులు పట్టణ ప్రాంత పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ పర్యవేక్షించాలని తెలిపారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలలో చేపట్టే నర్సరీలు, మొక్కల పెంపకం, డంపింగ్ యార్డు, వైకుంఠధామం (శ్మశానవాటిక) నిర్మాణాలు పబ్లిక్ టాయిలెట్స్, రోడ్లు, త్రాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ ఇతర ప్రగతి కార్యక్రమాలను నంబంధిత శాఖల అధికారుల నమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఖాజా నజీమ్ అలీ అప్సర్, జిల్లా నంక్షేమాధికారి రౌఫ్ ఖాన్, జిల్లా పంచాయతీ శాఖ అధికారి నారాయణరావు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, నంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటా చదువుల పండగ-పిల్లలంతా బడిలో నమోదు కావాలి

**- సమగ్ర శిక్ష జిల్లా సెక్టోరల్ అధికారి తుమ్మ ఆనందం**




వెల్గటూర్, జనవరి 12 (ప్రజాపాలన) ఆరు నుంచి 14 ఏళ్లలోపు పిల్లలంతా తప్పకుండా బడిలో నమోదయ్యేలా చూడాలని సమగ్ర శిక్ష జిల్లా సెక్టోరల్ అధికారి తుమ్మ ఆనందం సూచించారు. మంగళవారం వెల్గటూరు లోని కంకర క్రషర్ లలో నివాసముండే జనావాసాలు ఆకస్మికంగా సందర్శించారు. ఇక్కడ నివాసం ఉండే బడి ఈడు పిల్లలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఇంటింటా చదువుల పండుగ" పిల్లలంతా బడిలో నమోదు కావాలని తల్లిదండ్రులకు సూచించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థి 8595524405 నంబరు వాట్సాప్ గ్రూప్ లో చేరి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఆ విద్యార్థి ఆ తరగతికి సంబంధించి వారానికి రెండు సబ్జెక్టులపై ప్రశ్నలు వస్తాయని వాటికి సమాధానాలు రాసి కీ పేపర్ తో సరి చూసుకోవాలని తెలిపారు. తద్వారా ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థుల సామర్థ్యాలు స్వీయ పరిశీలన ద్వారా తెలుసుకునే అవకాశం తల్లిదండ్రులకు కలుగుతుందన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 6 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలందరూ విధిగా తమకు అందుబాటులో ఉన్న ఏదో ఒక పాఠశాలలో నమోదు ఉండాలని పేర్కొన్నారు.బడికి వెళ్లలేని స్థితిలో ఉన్న ప్రత్యేక అవసరాల చిన్నారుల కోసం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఇలాంటి వారు ఐ.ఆర్.పి.ల ద్వారా వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ వైద్య వెంకటేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నారాయణ స్కూల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

మధిర (జనవరి 12) పట్టణంలోని నారాయణ విద్యాసంస్థల్లో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా తొలుత పాఠశాల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సెబాస్టియన్ మాట్లాడుతూ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల ఏజీఎం రత్తయ్య, భువనగిరి నారాయణ, వనజ, అకాడమిక్ డీన్ రాజు పాల్గొన్నారు.




## మాటూరు హై స్కూల్లో ముగ్గుల పోటీలు




మధిర, జనవరి 12, ప్రజాపాలన :సంక్రాంతి పండుగ సందర్భంగా మాటూరు హైస్కూలు విద్యార్థినులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నటువంటి మండల విద్యాశాఖ అధికారి శ్రీ వై ప్రభాకర్ గారు గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా రేష్మ సృజన వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డి సాయి కృష్ణమాచార్యులు, ఉపాధ్యాయుల సంక్రాంతి శ్రీనివాస రావు మేడేపల్లి శ్రీనివాసరావు వేము రాములు ఎండి చాంద్ బేగం, రమాదేవి, అజీమ్ తదితరులు పాల్గొన్నారు

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మరియు కలెక్టర్



జగిత్యాల, జనవరి 12 (ప్రజా పాలన):జగిత్యాల పట్టణంలోని 9వ వార్డులో నూతన కలెక్టరేట్ నుండి కరీంనగర్ రోడ్ వరకు పట్టణ ప్రగతి నిధులు 60 లక్షలతో రోడ్ ఫార్మషన్ డ్రైనేజి నిర్మాణ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ రవి మున్సిపల్ చైర్ పర్సన్ శ్రావణి శంకుస్థాపన చేశారు. కొత్తగా మున్సిపల్ ఏర్పడ్డ తర్వాత ప్రజలకు అవసరమైన వాటిపై శ్రద్ధ వహించి పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని పట్టణ ప్రగతి నిధులు పట్టణ అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. కలెక్టర్ రవి మాట్లాడుతూ కొత్త కలెక్టరేటుల వల్ల అన్ని ఆఫీసులు ఒకె దగ్గరకు రావటం వలన ప్రజలకు చాలా ఉపయోగపడుతుందని రోడ్డు నిర్మాణానికి సహకరించిన మున్సిపల్ చైర్మన్ ఎమ్మెల్యేకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు. అక్రమ నిర్మాణాల్ని అరికట్టాలని తాము విరుద్ధమని మాకౌన్సిల్ కూడ అక్రమ కట్టడాల నిర్మూలన విషయంలో కట్టుబడి ఉన్నదని ఎమ్మెల్యే అన్నారు. జగిత్యాల సివిల్ హౌస్ ప్లానింగ్ ఇంజినీర్ విభాగం రియల్ ఎస్టేట్ వ్యాపారులు సైతం ప్రజలకు సూచనలు సలహాలు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు గట్టు సతీష్ కౌన్సిలర్ ఒద్ది శ్రీలత రామ్మోహన్ ముస్కు నారాయణ రెడ్డి పంబాల రాము దాసరి లావణ్య కొలగాని ప్రేమలత క్యాదాసు నవీన్ కో-ఆప్షన్ సభ్యులు వజ్రమ్మ వొళ్ళెం మల్లేశం దుమాల రాజకుమార్ బాలే శంకర్ సింగరావు ఒంటిపులి రాము కూతురు శేఖర్ ప్ముసిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మడుపల్లి గ్రామంలో విద్యాలత వెంకటరెడ్డి

మధిర, జనవరి 12, ప్రజాపాలన : మడుపల్లి గ్రామంలో మధిర మున్సిపాలిటీ వైస్ ఛైర్ పర్సన్ శ్రీమతి శీలం విద్యాలత వెంకటరెడ్డి గారు పర్యటించారు . ముందు గా గ్రామంలో లోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేకంగా పూజలు రామకృష్ణ దీక్షుతులచే చేసారు . అనంతరం స్వచ్ఛంద సేవా సంస్థ అన్న ఫౌండేషన్ ఛైర్మన్ మేళం శ్రీనివాస్ యాదవ్ గారి ఆర్థిక సహకారంతో మడుపల్లి గ్రామం నుండి అల్లీనగరం గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపులా ముళ్ళకంచె ను తొలగించే కార్యక్రమం ను పూజలు చేసి ప్రారంభించారు . ఈ కార్యక్రమం లో మధిర





మున్సిపాలిటీ వైస్ ఛైర్ పర్సన్ శ్రీమతి శీలం విద్యాలత వెంకటరెడ్డి గారు , అల్లీనగరం సర్పంచ్ గోసు వేలాద్రి గారు , భరత్ విద్యా సంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి గారు , మడుపల్లి మాజీ రేగళ్ళ సాంబశివరావు , శీలం వెంకటరెడ్డి ( ట్రాక్టర్ ) గారు , అన్న ఫౌండేషన్ వలంటీర్ రామారావు , కంభం విజయ్ , గోపాలరావు మడుపల్లి గ్రామస్థులు , అల్లీనగరం గ్రామస్థులు పాల్గొన్నారు .దీని అనంతరం కాలనీలో నిర్మాణం జరుగుతున్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ ను పరిశీలించారు , తర్వాత ఈ మధ్య లో గుండె ఆపరేషన్ చేయించుకున్న మల్లవరపు జగన్ మోహన రావు ఇంటికి వెళ్లి పరామర్శించారు , తర్వాత మినరల్ వాటర్ సప్లయర్ ఆటో డ్రైవర్ వేల్పుల గురవయ్య భార్య అనారోగ్యంతో ఇబ్బంది పడుతుంటే పరామర్శించారు.

## ప్రియాంక గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు:శ్రీనివాస్ యాదవ్ మేళం



మధిర, జనవరి 12, ప్రజాపాలన :అఖిల భారత కాంగ్రెస్ కమిటీ జాతీయ నాయకురాలులిశ్రీమతి ప్రియాంక గాంధీలి గారికి భారతదేశంలో అత్యంత ప్రజాదరణ గల దివంగత ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ గారి ఆశీస్సులతో ....ఉత్తరప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల సమర్థవంతంగా ఎదుర్కొంటూ లిజాతీయ యువజన దినోత్సవం రోజున యువత ను మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ పుట్టినరోజు జరుపుకుంటున్న సందర్భంగా వారికి శుభాకాంక్షలు రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలంటే శ్రీమతి ప్రియాంక గాంధీ గారు దేశవ్యాప్తంగా పర్యటనలు చేసి విజయపథం వైపు నడిపించాలని ఖమ్మం పార్లమెంటు ప్రజల తరపున కోరుకుంటున్నాం.

## యూనియన్ బ్యాంకులో టెక్నికల్ సమస్యలు



మధిర, జనవరి 12, ప్రజాపాలన : ఆంధ్రాబ్యాంక్ నుండి యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా గామారడంతో టెక్నికల్ సమస్యలు ఇంకా సరి కాకపోవడంతో బ్యాంక్ వినియోగదారుల కు ఇబ్బందులు తలెత్తుతున్నట్లు వినియోగదారులు వాపోతున్నారు.రైతులు, పెన్షన్ దారులు అనేక మంది కస్టమర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పుతున్నారు. ఈ నెల 11 వతేదీనుండి ట్రాన్సుక్షన్స్కు ఇబ్బందులు ఉండవని తెలిపారు. కానీ ఇంకా ఈ సమస్య పరిష్కారం కాకా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కస్టమర్లు తెలుపుతున్నారు.. బ్యాంక్ అధికారులు దీనిపై దృష్టి పెట్టి వినియోగదారుల కు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరుతున్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ



మధిర, జనవరి 12, ప్రజాపాలన :సోషల్ మీడియాలో వచ్చిన వార్త చూసి .. మూడు నెలలకు సరిపడా బియ్యం సరుకులు.. అందించిన ప్రముఖ పారిశ్రామిక వేత్త మనసున్న మంచి మనిషి కోన జనార్దన్ రావు గారు. ఇల్లూరు గ్రామానికి చెందిన పులగం కృష్ణవేణి అనారోగ్యంతో కనీసం తినటానికి కూడా తిండి లేని పరిస్థితుల్లో బాధ పడుతూ ఉండగా.. మధిర రెస్క్యూ టీం. వారి దీన స్థితిని వివరించగా.. మానవతా దృక్పథంతో. వారికి కోన జనార్దన్ రావు గారు సహాయపడ్డారు. అలాగే రాజవరం గ్రామానికి చెందిన క్యాన్సర్ తో బాధపడుతున్న మరో మహిళకు.. ఎంప్లాయిస్ కాలనీకి చెందిన మహిళకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు బియ్యం అందజేశారు.

## స్వామి వివేకానంద అడుగుజాడల్లో నడుద్దాం

### వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జనవరి 12 ( ప్రజాపాలన ) : స్వామి వివేకానంద అడుగుజాడల్లో నడుద్దామని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తెలిపారు. మంగళవారం జాతీయ యువజన దినోత్సవం స్వామి వివేకానంద158వ జయంతిని పురస్కరించుకుని వికారాబాద్ లోని జిల్లా గ్రంథాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని స్వామి వివేకానందుని విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... భారతదేశ ఔనత్యాన్ని ప్రపంచ దశదిశలా చాటి చెప్పిన స్వామీ వివేకానంద జన్మించిన జనవరి 12 ను భారతీయులందరం జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. స్వామీ వివేకానంద రామకృష్ణ మఠాన్ని స్థాపించి దీని ద్వారా భారత దేశ యువతకు దిశా నిర్దేశం చేశారన్నారు. తన ఉపన్యాసాలు, వాదనల ద్వారా భారతదేశాన్ని జాగృతం చేయడమే కాకుండా భారత దేశ సంస్కృతి, సంప్రదాయాలపై ప్రపంచ వేదికల్లో గొప్పగా ప్రసంగించి భారత జాతి ఖ్యాతిని పెంచారన్నారు. పాశ్చాత్య దేశాలలో అడుగుపెట్టిన మొదటి హిందూ సన్యాసి వివేకానందుడు అని కొనియాడారు. సమాజంలోని రుగ్మతలను ప్రశ్నించారని, తన ఉపాన్యాసాల ద్వారా యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపారన్నారు. యువతలో మేధాశక్తిని సన్మార్గంలో నడిపించేలా బోధించగలిగితే తద్వారా వారి కుటుంబాలతో పాటు దేశాబివృద్ధికి తోడ్పడిన వారవుతారని, ఇందుకు గాను నేటి యువత వివేకానందుని ఆలోచనలకు అనుగుణంగా నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మోతీలాల్, చంద్రయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్ళపల్లి మంజుల రమేష్, ఏఎంసి చైర్మన్ విజయ్ కుమార్, పిఏసిఎస్ చైర్మన్ ముత్యం రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, క్రీడాశాఖ అధికారి హనుమంత్ రావు, ఎస్సీ కార్పొరేషన్ అధికారి బాబు మోజెస్, డిటిడొ కొటాజి రావు, మున్సిపల్ కమిషనర్ బోగేశ్వర్లు కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనిధి డిగ్రీ కళాశాల విద్యార్థినికి పీజీ ఎంట్రన్స్‌లో 132వ ర్యాంక్




మధిర, జనవరి 12, ప్రజాపాలన :వంగవీడు కు చెందిన గుడిద లక్ష్మి ప్రసన్న గుడిద కృష్ణయ్య తెలంగాణలోని అన్ని యూనివర్సిటీలకు సంబందించి జరిగిన పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ లో బోటనీ సబ్జెక్టు లో 132 వ రాంక్ సాధించింది. శ్రీనిధి డిగ్రీ కళాశాల కు చెందిన విద్యార్థినిని ఆ కళాశాల చైర్మన్ వై అనిల్ కుమార్ నెహ్రూ మరియు సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ బి అంజనబాబు మరియు డైరెక్టర్ రమేష్ కళాశాల సిబ్బంది ఆ విద్యార్థిని అభినందించడం జరిగింది.



**అన్న ప్రసన్న కార్యక్రమంలో పాల్గొని చిన్నారి ఆశీర్వదించిన మొండి తోక. సుధాకర్ రావు గ్రంథసిరి వారి అన్నప్రాసన్న వేడుకలో పాల్గొని క్రిష్ కిట్టు తనయుడి ని ఆశీర్వదించిన జిల్లా నాయకులు మొండితోక సుధాకర్ రావు**

## భరత్ విద్యాసంస్థలలో ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు

మధిర, జనవరి 12, ప్రజాపాలన : నేడు జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఖమ్మం జిల్లా మధిర పట్టణంలోని భరత్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలోని స్వామి వివేకానంద విగ్రహానికి విద్యాసంస్థల అధినేతలు శీలం వెంకటరెడ్డి,విద్యాలత దంపతులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతకు స్వామి వివేకానంద జీవిత మార్గదర్శకం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు కప్పగంతుల రవి కుమార్, ప్రిన్సిపాల్స్ జింకల కోటేశ్వరరావు,నాగిరెడ్డి,రవీందర్ రెడ్డి, భవాని,అజీమ్,నాగరాజు,రాము తదితరులు పాల్గొన్నారు.



## నేటి యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

### డిసిసి ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జనవరి 12 ( ప్రజాపాలన ) : నేటి యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని డిసిసి ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్ తెలిపారు. మంగళవారం జిల్లా పరిధిలోని పరిగి పట్టణ కేంద్రంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానందుని బోధనలు, సూక్తులు కేవలం భారత యువతరానికి మాత్రమే పరిమితం కాదన్నారు. ఆధునిక భారత దేశం ప్రపంచంలోనే ఒక మహత్తర శక్తిగా ఎదగడానికి ఆయన పటిష్ఠమైన పునాదులు వేశారని ఆయన కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని తమ జీవితాల్లోను ఉన్నతమైన శిఖరాన్ని అధిరోహించవచ్చును అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలో పల్లెల్ని, ప్రజల్ని, యువతను మేల్కొల్పిన ఘనత స్వర్గీయ రాజీవ్ గాంధీ, స్వర్గీయ మాజీ సీఎం వైఎస్ఆర్ దని అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం ప్రజలకు కాంగ్రెస్ కార్యకర్తలకు 158వ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షుడు లాల్ కృష్ణ, సుభాష్ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ ఎర్రగడ్డ పల్లి కృష్ణ, పరిగి కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ పరశురాం రెడ్డి. కౌన్సిలర్లు శ్రీను, షబ్బనూర్ రియాజ్, మల్లేష్ కాంగ్రెస్ నాయకులు చిన్న నరసింహులు, నాగవర్ధన్, శివకుమార్, యువజన నాయకుడు ఎర్రగడ్డ పల్లి జగన్, జగన్ సేట్, రాము పటేల్ పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద జయంతి వేడుకలు

సారంగాపూర్, జనవరి 12 (ప్రజాపాలన):సారంగాపూర్ మండల కేంద్రంలోని స్వామి వివేకానంద 158 వ జయంతి వేడుకలను బీజేపీ మండల అధ్యక్షుడు జిల్లా దిశ కమిటీ మెంబెర్ ఎండబెట్ల వరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బద్దెల గంగరాజం బిజెవైఎం మండల అధ్యక్షుడు దీటి వెంకటేష్ కాలగిరి మధురెడ్డి కంపెల్లి శేఖర్ సామల ప్రసాద్ చెరుకు గంగారెడ్డి కసనవాదా శాంతయ్య పాలగొని మల్లేష్ జలపెల్లి సతీష్ తుపాకుల జలందర్ జంగిలి జగన్ పాల్గొన్నారు.




ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | | | |
|---|---|---|---|---|
| తల్లనారాయణ దాస్ | - | చేవెళ్ల | - | 9849526878 |
| డి. వరప్రసాద్ | - | తెల్లాపూర్ | - | 9553999990 |
| గణేష్ | - | బాలాపూర్ | - | 7993047109 |
| నరోత్తమ్‌రెడ్డి | - | మేడిపల్లి | - | 9346970159 |
| వెంకటచారి | - | మందమర్రి | - | 9440868581 |
| పి. లక్ష్మీనారాయణ గౌడ్ | - | కొల్చారం | - | 9912532909 |
| వెంకటస్వామి | - | మంచిర్యాల | - | 9515048103 |
| టి. సురేష్‌చారి | - | ఆసిఫాబాద్ | - | 9000983108 |
| అన్వర్ బాషా | - | కుత్బుల్లాపూర్ | - | 7993047109 |
| కళ్యాణ్ సి.ఎం. | - | కూకట్‌పల్లి | - | 7842672389 |
| ఎం. గైబులు | - | వికారాబాద్ | - | 9704570475 |


## జాగృతి మండల మహిళా సమాఖ్య రైస్ డిపోను ప్రారంభించిన ఎమ్మెల్యే సంజయ్



సారంగాపూర్, జనవరి 12 (ప్రజాపాలన): సారంగాపూర్ మండల కేంద్రంలోని మండల జాగృతి మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో రైస్ డిపో (బియ్యం దుకాణం) ను స్థానిక ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం మహిళ సమాఖ్య వారి వద్ద నుండి మొదటగా రైస్ బ్యాగ్ మరియు గోధుమ పిండిని కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మెడిపల్లి మనోహర్ రెడ్డి ఎంపీపీ కోలా జమునశ్రీనివాస్ తహశీల్దార్ తిరుమల్ ఎంపీడీవో పుల్లయ్య ప్యాక్స్ చైర్మన్ ఏలేటి నరసింహ రెడ్డి ఎంపీటీసీ జోగినపల్లి సుధాకర్ రావు సోల్లు సురేందర్ గుర్రాల రాజేందర్ రెడ్డి ఢిల్లీ రామారావు మహిళా సమాఖ్య సంఘాల నాయకులు మహిళలు పాల్గొన్నారు.

## టీడీపి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు



జగిత్యాల, జనవరి 12 (ప్రజాపాలన): జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామంలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి 158 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపి రాష్ట్ర కార్యదర్శి దయాల మల్లారెడ్డి నిజామాబాద్ పార్లమెంట్ అధికార ప్రతినిధి వనమాల నిరంజన్ పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు కోరుకంటి రాము జిల్లా కార్యదర్శి ఎల్లేటి సురేందర్ రెడ్డి పట్టణ ప్రధాన కార్యదర్శి తుమ్మనపల్లి రమేష్ గుగ్గిల సత్యనారాయణ బుర్ర గిరిధర్ గౌడ్ గంధం సుధాకర్ టీడీపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## వృద్ధాప్యంలో కండలు ఇక కరగవు



వయసు పైబడినకొద్దీ కండలు కరిగిపోతుంటాయి. వృద్ధాప్యంలో కాళ్లు, చేతుల్లోని కండరాలు కరిగిపోయి బక్కచిక్కినట్లు కనిపిస్తుంటారు. అయితే అలా ఎందుకు అవుతుందో మాత్రం ఇప్పటివరకు ఎవరూ చెప్పలేకపోయారు. దీనిపై పరిశోధన జరిపిన యూకేలోని మాంచెస్టర్ మెట్రోపాలిటన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు.. వయసుపైబడే కొద్దీ కాళ్లలోని కండరాలను నియంత్రించే 30 నుంచి 50శాతం నాడులు బలహీనపడిపోతాయని గుర్తించారు. దీంతో మెదడు, కండరాల మధ్య సంబంధం తెగిపోవడం వల్ల కండలు కరిగిపోతాయని శాస్త్రవేత్తలు తెలిపారు. అయితే ఈ నాడులు బలహీనపడటాన్ని తగ్గిస్తే కండరాలు కరగకుండా జాగ్రత్త పడొచ్చని పేర్కొన్నారు.

## వృద్ధ విలాపం!



'వృద్ధులను గౌరవించాలి'... బస్సుల్లోనో, బడి గోడలపైనో కనిపించే నీతి వాఖ్యమిది. దీనిని ఎవరూ ఆచరణలో చూపడం లేదు. దేశంలో ప్రతి ఇద్దరు వృద్ధుల్లో ఒకరు ఒంటరితనంలో బాధపడుతున్నారు. కనీసం ప్రేమగా మాట కలిపేవారు కూడా లేక కుంగుబాటుకు గురవుతున్నారు. తల్లిదండ్రులను వదిలేసి పిల్లలు తమ దారి తాము చూసుకోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ పరిస్థితి పట్టణాల్లో మరీ ఎక్కువ గా ఉంది. 10 కోట్ల మందికి పైగా ఉన్న వృద్ధులున్న మన దేశంలో అనేక మంది మానసిక సమస్యలతో బాధపడడానికి ఒంటరితనమూ కారణమవుతోంది. 'భారత్‌లో మారుతున్న వృద్ధుల అవసరాలు, హక్కులు' అనే పేరుతో ఏజ్‌వెల్ అనే సంస్థ సర్వే నిర్వహించి ఈ వివరాలను వెల్లడించింది. 25 రాష్ట్రాల్లో 15 వేల మంది వృద్ధులతో ఈ సంస్థ మాట్లాడింది. ఇందులో 47.49 శాతం ఒంటరితనంతో గుబులుగా బతుకీడుస్తున్నారు. పట్టణాల్లో 5 వేల మంది సర్వేలో పాల్గొనగా వారిలో 3,205 మంది(64.1 శాతం) ఒంటరి జీవులే. ఇక పల్లెల్లో 10 వేల మంది సర్వేలో పాల్గొనగా వారిలో 39.19 శాతం కనీసం మాట పలకరింపునకూ నోచుకోవడం లేదు.

కారణాలివి..

సర్వేలో పాల్గొన్న వారిలో ఎక్కువ మంది తమ జీవిత భాగస్వామిని కోల్పోయిన వృద్ధులు, లేదా పిల్లలతో సంబంధం లేకుండా కేవలం భార్యతో కలిసి విడిగా జీవిస్తున్న వారున్నారు. ఇది వారిలో ఒంటరి తనం భావనను పెంచుతోంది. ఇలా జీవిస్తున్న వారు 36.78 శాతం ఉన్నారు.

కుటుంబంతో కలిసి ఉంటున్న వారి విషయంలోనూ 27.3 శాతం వృద్ధులు.. కుటుంబ సభ్యులెవరూ పెద్దగా పట్టించుకోక పోవడంతో నలుగురిలో ఉండి ఒంటరితనాన్ని అనుభవిస్తున్నారు.

19.06% అనారోగ్యం కారణంగా, 12 % సామాజికంగా సంబంధాల్లేక ఏకాకులవుతున్నారు.

ప్రతి ఐదుగురిలో ఒకరికి ఒంటరితనం వల్ల మానసికసమస్యలతో కౌన్సెలింగ్ తప్పనిసరి అవుతోంది.

# శతమానం భవతి

ముప్పై ఏళ్లకి ఆయాసం, నలభై ఏళ్లకి నీరసం.. ఇటీవల చాలామందిలో చూస్తున్న పరిస్థితి ఇది. ఇక యాభయ్యో పడిలో పడితే గుప్పెడు మాత్రలు మింగుతూ ఇంటిపట్టున కృష్ణారామా అనుకుంటూ కూర్చోవలసిందే! మన దగ్గర ఇలా ఉంటే జపాన్ దగ్గరున్న 'ఒకినావా' దీవి వాసులు మాత్రం శతాధికవృద్ధులుగా ప్రపంచ ప్రఖ్యాతి పొందుతున్నారు. అక్కడి 'జిరోమాన్ కిమురా' అనే ఓ శతాధిక వృద్ధుడు ఏకంగా 116 ఏళ్లదాకా బతికి ఇటీవల కొత్త రికార్డు సృష్టించాడు. ఇతనికి ముందు మిసావో ఒకావా అనే మహిళ 115 ఏళ్లు జీవించిన శతాధికురాలిగా పేరు తెచ్చుకుంది. జపనీయులు వందేళ్లు జీవిస్తూ పేరు తెచ్చుకుంటే, ఒకినావా వాసులు ఏకంగా సెంచరీ కూడా దాటేసి ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తున్నారు. అయితే వీళ్లింత సుదీర్ఘకాలం జీవించటం వెనకో ఆరోగ్య రహస్యం ఉంది. అదే...'ఒకినావా డైట్'.

ఒకినావా అనేది జపాన్‌లోని ఓ దీవి. ఈ దీవిలోని వాళ్లంతా నిండు నూరేళ్లపాటు జీవించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. మరి దీర్ఘాయుష్షు కోసం వీళ్లంతా ఏం తిన్నారు? ఆ వివరాలు తెలియాలంటే ఒకినావా ఆహారశైలి గురించి తెలుసుకోవాలి.

ఒకినావా 'చిలకడ దుంప'

ఒకినావా ద్వీపంలో ఇప్పుడు కనిపించే శతాధిక వృద్ధులందరూ 1903 – 1914 మధ్యకాలంలో పుట్టినవాళ్లే! వీళ్ల జీవితంలో మొదటి పావు భాగం వరకు... అంటే 1940 వరకూ ఎక్కువ శాతం, దాదాపు 60 శాతం క్యాలరీలను ఒకే ఒక పదార్థం నుంచే తీసుకున్నారు. అదే 'ఐమో'. ఐమో అనేది ఒకినావా ద్వీపంలోని చిలకడ దుంప. వంకాయ లేదా పసుపుపచ్చ రంగులో ఉండే ఈ స్వీట్ పొటాటో 400 ఏళ్లకు పూర్వం అమెరికా నుంచి ఈ దీవికి తరలి వచ్చింది. దీన్లో అత్యధిక ఫ్లావనాయిడ్స్, విటమిన్ సి, కెరోటినాయిడ్స్, ఆలస్యంగా ఖర్చయ్యే పిండి పదార్థాలున్నాయి.

తక్కువ క్యాలరీలు: ఒకినావా వాసులు జపనీయుల కంటే 20 శాతం తక్కువ క్యాలరీలున్న ఆహారం తింటారు. ఒక గ్రాము ఆహారానికి ఒక గ్రాము క్యాలరీ ఉండేలా చూసుకుంటారు. వాళ్ల బిఎమ్ఐ (బాడీ మాస్ ఇండెక్స్) సుమారుగా 20. దీన్నిబట్టి క్యాలరీలను కంట్రోల్ చేస్తే బరువు అదుపులో ఉండటంతోపాటు ఈ కింది ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ఆరోగ్యం మెరుగవుతుంది... వృద్ధాప్యం ఆలస్యమవుతుంది.




ఒకినావాలు పళ్లు, కూరగాయలను గ్రీన్, ఆరెంజ్, ఎల్లో (జిఓవై)...ఈ మూడు రంగుల్లో వర్గీకరించుకుటారు. ఈ రంగుల్లో ఉండే పళ్లు, కూరగాయలు, దుంపలను మాత్రమే తింటారు. జిఓవై ఫుడ్‌లో విటమిన్ ఎ, విటమిన్ సి, బీటా కెరోటిన్, లుటీన్, గ్జాంథీన్ వంటి పోషకాలుంటాయి.

తక్కువ చక్కెర, కొవ్వులు: ఆరోగ్యాన్ని శుష్కింపజేసేవి చక్కెర, కొవ్వులే! కాబట్టి 'ఒకినావా డైట్'లో వీటికి స్వల్ప స్థానం ఉంటుంది. వీళ్ల దైనందిన ఆహారంలో 25 శాతం చక్కెర, కొవ్వులు ఉంటాయి. మిగతా 75 శాతం పప్పుధాన్యాలతో నిండి ఉంటుంది. కాబట్టే వీళ్లకు హృద్రోగాలు, గుండెపోట్లు రావు.

కూరగాయలు, సముద్రాహారం: ఎక్కువమంది ఒకినావాలు శాకాహారులే! వాళ్లుండే ప్రదేశం దీవి కాబట్టి వీళ్లలో కొందరు సముద్రాహారం కూడా తింటారు. అయితే తక్కువ మొత్తంలో చేపలు, ఎక్కువగా కూరగాయలు తింటారు. ఇక మాంసం, డైరీ ఉత్పత్తులు, గుడ్లకు సాధ్యమైనంత దూరంగా ఉంటారు. ఒకినావా డైట్ ఎంతో క్రమశిక్షణతో కూడుకున్నది. ఆరోగ్యానికి మేలు చేస్తూ ఆయుష్షుని కాపాడే పదార్థాలను ఆచితూచి ఎంచుకోబట్టే అక్కడివాళ్లకు అంత దీర్ఘాయుష్షు.

## ఒంటరితనం ఒడిలో...



ఇటీవల కాలంలో చాలామంది సీనియర్ సిటిజన్స్ తీవ్రమైన డిప్రషన్‌కు లోనవుతున్నారు. ముఖ్యంగా విదేశాల్లో ఉన్న పిల్లలు తల్లిదండ్రుల సంరక్షణా బాధ్యతను బంధువులు లేదా పనివాళ్ల చేతుల్లో పెట్టేస్తున్నారు. సీనియర్ సిటిజన్లలో పెరుగుతున్న డిప్రషన్‌కు ఇది ప్రధాన కారణమని మానసిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. పిల్లలు దగ్గర లేక పనివాళ్ల దయాదాక్షిణ్యాల మీద సీనియర్ సిటిజన్లు ఆధారపడవలసి వస్తోంది. ఫలితంగా తీవ్రమైన ఒంటరితనాన్ని వీళ్లు ఫీలవుతున్నారు. కొందరు వృద్ధులైతే ఆ ఒంటరితనాన్ని భరించలేక ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు. చండీఘడ్‌లో ఈ పరిస్థితులు బాగా కనిపిస్తున్నాయని మానిసిక నిపుణులు పేర్కొన్నారు. 'తల్లిదండ్రులు ఈ వయసులో పిల్లల నుంచి ప్రేమ, వాత్సల్యాలు, అండదండలు కోరుకుంటార'ని నిపుణులు చెప్తున్నారు. చండీఘడ్‌లో ఇలాంటి సీనియర్ సిటిజన్ బాధితుల సంఖ్య రెట్టింపు అయిందని గణాంకాలు చెప్తున్నాయి. చండిఘడ్‌లోని పోస్టు గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సంస్థకు చెందిన సైకియాట్రిస్టు నిపుణులు మాట్లాడుతూ గత తొమ్మిదేళ్ల కాలంలో చండీఘడ్‌లో ఒంటరితనంతో బాధపడుతున్న సీనియర్ సిటిజన్ల సంఖ్య రెట్టింపు అయిందని వెల్లడించారు. 2008 ఒపిడిలో నమోదైన సీనియర్ సిటిజన్ కేసులు 580 ఉండగా, 2016 నాటికి వీరి సంఖ్య రెట్టింపు అంటే 1,488 అయిందని చెప్పారు. 'గతంలో పిల్లలతో ఆసుపత్రికి వచ్చే సీనియర్ సిటిజన్లు ఇప్పుడు సర్వెంట్లతో వస్తున్నారు. మానసిక సమస్యలతోపాటు ఆరోగ్య సమస్యలు కూడా వీరిని బాధిస్తుంటాయి. దీంతో ఒంటరిగానే వైద్యుల వద్దకు వీళ్లు వెళ్లాల్సివస్తోంది' అని మానసిక వైద్యులు ఒకరు తెలిపారు. అలాగే సీనియర్ సిటిజన్లు ఎక్కువగా డెమన్షియా అనే మానసిక సమస్యతో బాధపడుతున్నారు. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే సీనియర్ సిటిజన్లకు నిత్యం ఫిజికల్ యాక్టివిటీ, మెంటల్ యాక్టివిటీ అవసరమని నిపుణులు తేల్చారు. కథలు చెప్పడం, కొత్త సాంకేతిక పరికరాలను వాడడం వంటి పనుల్లో వారి బ్రెయిన్లను బిజీగా ఉంచితే వారు ఒంటరితనాన్ని అధిగమించగలరు. సమాజ సేవలో సైతం పాలుపంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. 'రిటైర్డ్ లైఫ్ గడపకుండా తమ హాబీలను కొనసాగిస్తూ నిత్యోత్సాహంగా ఉండాలి. ఇలా చేయడం వల్ల వాళ్లు నిరంతరం యంగ్‌గా ఉంటారు. అప్పుడు తమది ఓల్డ్ ఏజ్ కాదు... 'గోల్డ్ ఏజ్' అని వాళ్లు అనుకుంటారు' అని మానసిక నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

## మలివయస్సుకి పీచు రక్షణ!

యాభై సంవత్సరాలకి ముందు ఎలాంటి ఆహారం తీసుకున్నా, యాభై దాటిన తరువాత మాత్రం తాము తీసుకునే ఆహారంలో కచ్చితంగా పీచు ఉండే విధంగా చూసుకోవాలి అంటున్నారు ఆస్ట్రేలియా యూనివర్సిటీ పరిశోధకులు. యాభై నుంచి డెబ్బై సంవత్సరాల మధ్య వయస్సుగల సుమారు 1500 మంది మీద వీరు సుదీర్ఘ కాలం పాటు అధ్యయనం నిర్వహించారు. వీరిలో కొందరికి మామూలు ఆహారం అందించారు. మిగతా వారికి పీచు అధికంగా కలిగిన ఆహారాన్ని అందించారు. కొన్ని రోజుల అనంతరం వీరిని పరిశీలించగా, పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకున్న వారిలో ఎక్కువమంది మునుపటి కన్నా మరింత ఆరోగ్యంగా ఉండగా, పీచు తీసుకోని వారిలో రకరకాల ఆరోగ్య సమస్యలు వీరి దృష్టికి వచ్చాయి. అవన్నీ సాధారణంగా వయస్సురీత్యా వచ్చే సమస్యలే అయినా, పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వలన వాటి బారి నుంచి చాలా వరకూ తప్పించుకోవచ్చు అని పరిశోధనాకారులు అంటున్నారు.

# ఆ వయసులో ఆసరా

వయసు మీరిన పెద్ద వాళ్లు ఇంట్లో ఉంటే వాళ్లని సౌకర్యంగా ఉంచాలి. సురక్షితంగా చూసుకోవాలి. అందుకు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే... వాళు అన్ని రకాలుగా సేఫ్‌జోన్‌లో ఉన్నట్టు భావిస్తారు.

బరువు తక్కువ ఉన్న చిన్న జగ్ నిండా నీళ్లు నింపి అందుబాటులో ఉంచాలి. నీళ్లు తరచుగా తాగుతుండమని చెప్పాలి వాళ్లకు. శరీరానికి సరిపడా నీటిని అందించడం వల్ల తలనొప్పులు, నిద్రలేమి, ఆకలి మందగించడం వంటి ఇబ్బందులు ఎదురు కావు. ఒక్క ముక్కలో చెప్పాలంటే మంచి నీళ్లు సరిపడా తాగితే బోలెడు అనారోగ్యాల్ని దరిచేరనీయకుండా జాగ్రత్తపడొచ్చు.

ఇంట్లో ఎక్కడపడితే అక్కడ అద్దాలు ఉంచొద్దు. ఆ అద్దాలు చూసి పెద్దవాళు తికమక పడే అవకాశం ఉంది. కొన్నిసార్లు వాళ్ల ప్రతిబింబాన్ని వాళ్లే గుర్తించలేని స్థితిలో ఉంటారు. అద్దం ముందు నడిచినప్పుడు కూడా గందరగోళ పడతారు. ఒకవేళ అద్దాలు పెట్టడం తప్పదంటే చిన్న అద్దాల్ని గోడల మీద కాస్త ఎత్తులో అమర్చాలి.

ఫోన్, రిమోట్ డయల్, నెంబర్ ప్యాడ్‌ల మీద అంకెలు, అక్షరాలు పెద్ద సైజులో ఉండాలి. ఇంట్లో డిజిటల్ క్లాక్స్ ఉంచాలి. సంప్రదాయ గడియారాల్లో కంటే డిజిటల్ క్లాక్స్‌లో చదవడం సులభంగా ఉంటుంది.

ఇక వాళ్లు వేసుకునే దుస్తుల రంగుల విషయంలో కూడా జాగ్రత్త వహించాలి. నలుపు, లేత గోధుమరంగు, తెలుపు, క్రీం, ఆకుపచ్చ రంగులవి దస్తులు అయితే వాళ్ల బట్టల్ని వాళ్లు సులభంగా తీసుకోగలుగుతారు. వార్డ్‌రోబ్‌లో షర్ట్స్ అన్నీ ఒక పక్కకి, ప్యాంట్లు, షార్ట్స్, లుంగీలు మరో పక్కకి సర్దాలి. అలాగే చీరలు, స్కర్ట్స్ వంటివి ఒక పక్కన, బ్లౌజ్‌లు, కుర్తా టాప్స్ మరో పక్కన సర్దాలి. వాడని బట్టలు వార్డ్ రోబ్ నుంచి తీసేయాలి.

ఈ జాగ్రత్తలన్నింటితో పాటు ఇంట్లో మీరు తీసుకునే నిర్ణయాల్లో వాళ్లని కూడా భాగస్వాములు చేయాలి. ఇలా చేయడం వల్ల వయసు మీద పడటంతో తమకి ప్రాధాన్యత తగ్గింది అనే భావన వాళ్లలో తలెత్తదు. మరో ముఖ్యమైన విషయం వాళ్ల ముందు ఎక్కువ చాయిసలు ఉంచితే ఎంపిక చేసుకోవడంలో గందరగోళానికి గురయ్యే అవకాశం ఉంది. ఈ పరిస్థితి ఎదురుకాకుండా ఉండాలంటే వాళ్లకి నచ్చే వాటినుండి కొన్ని చాయిసలు ముందుపెట్టాలి. వాటి నుంచి ఎంపిక చేసుకోమని చెప్పాలి.

# కాళ్ల మీద కన్నేయండి!

కొన్ని ఆరోగ్య సమస్యలు చాప కింద నీరులా శరీరాన్ని కుదేలు చేస్తాయి. అలాంటివాటిలో 'వెరికోజ్ వెయిన్స్' ఒకటి. అయినా 'ఆ సమస్య మనకెందుకొస్తుందిలే! మనమేం వృద్ధులం కాదు, కాయకష్టం చేసుకునేవాళ్లం కాదు' అనుకుంటున్నారా? కానీ ఇది 14 నుంచి 90 లోపు వయసున్న ఎవరికైనా, ఎప్పుడైనా రావొచ్చు. పురుషులతో పోలిస్తే స్త్రీలలోనే ఈ సమస్య ఎక్కువ. శ్రమజీవులకే కాదు, ఇంటి పట్టున ఉండేవాళ్లలోనూ ఈ ఇబ్బంది తలెత్తవచ్చు. వెరికోజ్ వెయిన్స్ సర్వసాధారణమైన సమస్య. ప్రపంచవ్యాప్తంగా 20% మంది ఈ సమస్యతో బాధపడుతున్నారంటే ఇది ఎంత సాధారణమైనదో అర్థం చేసుకోవచ్చు. అసలీ సమస్య ఎందుకు తలెత్తుతుంది? దీనికి కారణాలేంటి?

వెరికోజ్ వెయిన్స్ అంటే?

కాళ్లలో రెండు రకాల సిరలుంటాయి. పైకి కనిపించే 'సూపర్‌ఫిషియల్ వెయిన్స్', చర్మం అడుగున 'డీప్ వెయిన్స్' అనే రెండు రకాల సిరల్నవమాట. వీటిలో చర్మం అడుగున ఉండేవి మన కళ్లకు కనిపించవు. ఉబ్బినట్టు కనిపించేవి సూపర్‌ఫిషియల్ వెయిన్స్ మాత్రమే! అయితే ఈ రెండు రకాల సిరలూ కాళ్ల నుంచి రక్తాన్ని గుండెకు చేరవేస్తూ ఉంటాయి. ఆ మార్గంలో కవాటాలు చెడిపోతే రక్తం పూర్తిగా పైకి ఎగబాకలేక కాళ్లలోనే నిలిచిపోతూ ఉంటుంది. సిరల్లో ఉండే వన్ వే వాల్వ్‌లు రక్తం పైకి వెళ్లాక మూసుకోవాలి. కానీ అవి చెడిపోవడం వల్ల రక్తం పైకి వెళ్లకుండా కిందకే వచ్చేస్తుంది. పైకి కనిపిస్తే వాటిని తేలికగానే కనిపెట్టవచ్చు. కానీ కొందరికి డీప్ వెయిన్స్ ఉబ్బుతాయి. వీటిని కనిపెట్టడం కష్టం.

ప్రారంభంలోనే కనిపెట్టాలి!

చర్మం అడుగున ఉండే వెరికోజ్ వెయిన్స్ ఉబ్బితే స్పష్టంగా కనిపిస్తాయి. కానీ పిక్కల లోపలి సిరలు ఉబ్బితే కంటికి ఏమీ కనిపించదు. కాబట్టే ఈ మధ్య కాలంలో ఈ సమస్యను వెరికోజ్ వెయిన్స్‌గా సంబోధించడానికి బదులు 'వీనస్ ఇన్‌కాంపిటెన్స్' అంటున్నారు. వీనస్ ఇన్‌కాంటినెన్స్ అంటే... ఓ సమస్య కారణంగా సిరలు పని చేయడం మానేయడం. అయితే ఏ సిరలు ఉబ్బినా సమస్య తాలూకు లక్షణాలు కొన్ని ఉంటాయి. అవేంటంటే...

కాళ్లు నల్లబారడం

అరగంట లేదా గంటపాటు నిలబడితే కాళ్లలో నొప్పి, కాళ్లు లాగుతూ ఉండడం

కాళ్లు బరువనిపించడం

సాయంకాలమవుతున్నకొద్దీ కాళ్లు లాగేస్తూ ఉండడం, వాయడం, నొక్కించుకోవాలనిపించడం.

పాదాల్లో పుండ్లు

చర్మం రంగు మారి, పొట్టు రాలడం

ఇవీ కారణాలు!

వెరికోజ్ వెయిన్స్ తలెత్తడానికి ఇదీ కారణం అని నిర్దిష్టంగా చెప్పలేం! కానీ వంశపారంపర్యంగా సంక్రమించే గుణం దీనికుంది. అలాగే జన్యువుల్లో లోపాల వల్ల కూడా కొందర్లో ఈ సమస్య కనిపించవచ్చు. అయితే ఒకసారి ఈ సమస్య మొదలైతే ఎక్కువసేపు నిలబడి ఉద్యోగాలు చేసే టీచర్లు, ట్రాఫిక్ కానిస్టేబుళ్లు మొదలైన వాళ్లలో సమస్య మరింత తీవ్రమవుతుంది. అంతకు ముందువరకూ ఈ సమస్య లేకపోయినా కొత్తగా మొదలైతే కూడా ఇది క్రమేపీ పెరుగుతూ పోతుంది. అలాగే ఊబకాయుల్లో కూడా ఈ సమస్య తలెత్తే అవకాశం ఉంటుంది. వెరికోజ్ వెయన్స్ రాకుండా ఉండాలంటే పిక్క భాగం కదులుతూ ఉండాలి. కానీ ఎక్కువ సమయం పాటు కూర్చునే ఉద్యోగాలు చేయడం, ఇంట్లో ఉన్నప్పుడు కూడా ఎక్కువగా విశ్రాంతిలో గడపడం వల్ల పిక్క భాగానికి తగిన వ్యాయామం దొరకట్లేదు. ఇలాంటి సెడెంటరీ లైఫ్ స్టయిల్ వల్ల కూడా వెరికోజ్ వెయిన్స్ సమస్య మొదలవ్వొచ్చు.

వెరికోజ్ వెయిన్స్ రాకుండా!

వెరికోజ్ వెయిన్స్ వచ్చే వీలుండే జన్యువులు కలిగి ఉంటే ఈ సమస్య కచ్చితంగా వస్తుంది. తల్లితండ్రుల నుంచి పిల్లలకూ ఇది సంక్రమించవచ్చు. అయితే ఈ ఇబ్బంది తలెత్తకుండా ఉండాలంటే వెరికోజ్ వెయిన్స్ వచ్చే వీలున్న వాళ్లు, కొన్ని ఆరోగ్యపరమైన అలవాట్లను అలవరుచుకుంటే కొంత మేరకు నియంత్రించవచ్చు. అలాగే వెరికోజ్ వెయిన్స్ వచ్చినా, అది మరింత తీవ్రతరం కాకుండా కూడా నియంత్రించుకోవచ్చు. వంశపారంపర్యంగా సంక్రమించే వీలు లేకపోయినా నిలబడి ఉద్యోగాలు చేసేవాళ్లు, ఎక్కువ సమయంపాటు కూర్చుని ఉద్యోగాలు చేసేవాళ్లు కాలి పిక్కలు కదిలేలా కొన్ని జాగ్రత్తలు తప్పక పాటించాలి. అవేంటంటే....

నిలబడి ఉద్యోగాలు చేసేవాళ్లు ప్రతి పది నిమిషాలకోసారి పది అడుగులు అటూ ఇటూ నడవాలి. ఇలా ప్రతి పది నిమిషాలకూ చేస్తూ ఉండాలి.

టీచర్లు ఉన్న చోటనే నిలబడకుండా క్లాస్‌రూమ్‌లో అటూ ఇటూ నడుస్తూ ఉండాలి.

స్థూలకాయుల్లో వెరికోజ్ వెయిన్స్ వచ్చే అవకాశాలు 30 నుంచి 40% ఎక్కువ. కాబట్టి బరువు తగ్గించుకోవాలి.

ఎక్కువ సమయంపాటు కూర్చుని ఉద్యోగం చేసేవాళ్లు కూడా కూర్చున్న చోటే కాలి పిక్కలు కదిలే వ్యాయామాలు చేయాలి. ప్రతి అరగంటకూ లేచి కనీసం 5 నిమిషాలపాటైనా నడుస్తూ ఉండాలి.

స్నానం చేస్తున్న ప్రతిసారీ కాళ్ల మీద దృష్టి పెట్టాలి. రంగు మారుతున్నాయేమో గమనించాలి.

నిర్లక్ష్యం చేస్తే?

విదేశాలతో పోలిస్తే మన దేశంలో వెరికోజ్ వెయిన్స్ మీద అవగాహన తక్కువ. కాబట్టే సమస్య తీవ్రమైన తర్వాత వైద్యులను కలుస్తూ ఉంటారు. వెరికోజ్ వెయిన్స్ వల్ల కాళ్ల నొప్పులుంటాయి. కాబట్టి ఆ నొప్పులతో కొందరు నడకను పూర్తిగా తగ్గించేస్తారు. దాంతో సమస్య మరింత తీవ్రమవుతుంది. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే...

కాళ్ల మీద చర్మం నల్లగా మారి, అందవిహీనంగా తయారవుతుంది.

ఈ దశను నిర్లక్ష్యం చేస్తే కాళ్ల మీద పుండ్లు ఏర్పడతాయి.

ఉబ్బిన సిరల్లో రక్తం గడ్డలు ఏర్పడి (థ్రోంబోసిస్) గుండెకు చేరుకుని గుండె పోటుకు దారితీస్తాయి.

రక్తసరఫరా సరిగా జరగదు కాబట్టి తీవ్రమైన ఇన్‌ఫెక్షన్లూ కలగొచ్చు.

గర్భిణుల్లో!

30 నుంచి 50 ఏళ్ల లోపు మహిళల్లో వెరికోజ్ వెయిన్స్ సమస్య మొదలవ్వొచ్చు. మరీ ముఖ్యంగా గర్భిణుల్లో ఈ ఇబ్బంది తలెత్తే అవకాశాలు ఎక్కువ. గర్భంతో ఉన్నప్పుడు పెరిగిన శరీర బరువు వల్ల కాళ్లలోని సిరల మీద ఒత్తిడి పడుతుంది. దాంతో వెరికోజ్ వెయిన్స్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. మరీ ముఖ్యంగా తల్లితండ్రుల్లో ఎవరికైనా వెరికోజ్ వెయిన్స్ ఉంటే గర్భిణులు మరింత అప్రమత్తంగా ఉండాలి. గర్భంతో ఉన్నా వైద్యుల సూచనల మేరకు పిక్కల కదలికలు పెంచే వ్యాయామాలు క్రమం తప్పకుండా చేయాలి. కొందరు గర్భిణుల్లో గర్భంతో ఉన్నప్పుడు కనిపించే వెరికోజ్ వెయిన్స్ ప్రసవం తర్వాత తగ్గిపోవచ్చు. ఇంకొందరికి ప్రసవం తర్వాత కూడా కొనసాగవచ్చు.

కాళ్ల మీద పుండ్లు

మధుమేహంతో సంబంధం లేని 'నాన్ డయాబెటిక్ అల్సర్లు' వెరికోజ్ వెయిన్స్ వల్లే ఏర్పడతాయి. ఈ సమస్యను పుండుగానే చూస్తారే తప్ప అది ఏర్పడడానికి కారణం గురించి ఆలోచించరు. చర్మం రంగు మారితే చర్మ వైద్యులను కలిసి, పైపూతలు, ఆయింట్‌మెంట్లు పూయడం చేస్తుంటారు. పుండు పడితే యాంటీబయాటిక్ క్రీమ్‌లు వాడుతూ ఉంటారు. ఇలా వెరికోజ్ వెయిన్స్ వల్ల ఏర్పడిన పుండ్లు నిర్లక్ష్యానికి గురై మరీ పెద్దవైతే పూర్తిగా కాలే తొలగించాల్సిన దుఃస్థితికీ దారితీయొచ్చు. కాబట్టి అకారణంగా కాళ్ల మీద పుండ్లు ఏర్పడితే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రతించాలి.

7 'ఎండోవీనస్ లేజర్ సర్జరీ'తో సత్ఫలితం!


వెరికోజ్ వెయిన్స్ సమస్య మందులతో తగ్గదు. కాళ్ల మీద వచ్చిన నలుపును ఎటువంటి ఆయింట్‌మెంట్లు, నూనెలూ తగ్గించలేవు. ఇలా చేయకూడదు కూడా! వెరికోజ్ వెయిన్స్‌ను తగ్గించాలంటే 'కన్జర్వేటివ్ లేదా సర్జికల్' పద్ధతులనే అవలంబించాలి. కన్జర్వేటివ్ మెథడ్‌లో వెరికోజ్ వెయిన్స్ సమస్య తీవ్రం కాకుండా కొన్నాళ్లపాటు సాక్స్ వేసుకోవచ్చు. సాక్స్‌కు బదులుగా చేతికందిన గుడ్డలు కట్టేయకూడదు. మెడికేటెడ్ సాక్స్ వేసుకుంటేనే సిరల మీద ఒత్తిడి పడుతుంది. సాక్స్ పద్ధతి కూడా ప్రారంభదశలో ఉన్న వెరికోజ్ వెయిన్స్‌కే పని చేస్తుంది. సాక్స్ కొంతవరకూ సమస్యను కంట్రోల్ చేస్తుంది కానీ నయం చేయదు. ఎప్పుడు సాక్స్ వేయడం మానేస్తే అప్పుడు తిరిగి వెరికోజ్ వెయిన్స్ ఉబ్బడం మొదలుపెడతాయి. కాబట్టి శాశ్వతంగా ఈ సమస్య తొలగించుకోవాలంటే లేజర్ సర్జరీని ఆశ్రయించాలి. పాత రోజుల్లో ఉబ్బిన సిరలను కత్తిరించి తీసేసేవాళ్లు. దీని ఫలితం 60 శాతమే! ఈ సర్జరీలో మత్తు ఇచ్చి, కోసి, సిరలను తీసేస్తారు. కాబట్టి కుట్లు పడతాయి. ఎక్కువ రోజులు ఆస్పత్రిలో ఉండాలి. కోలుకోవడానికి కూడా ఎక్కువ సమయం పడుతుంది. ఈ సర్జరీకి ప్రత్యామ్నాయంగా లేజర్ సర్జరీ ప్రస్తుతం అందుబాటులోకొచ్చింది. దీన్లో వెరికోజ్ వెయిన్స్‌ను నిర్ధారించుకోవడం కోసం వాడే స్కానింగ్ మిషన్‌ను ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లి, ఏ సిరలు పని చేయట్లేదో వాటిలోకి లేజర్ ఫైబర్‌ను పంపిస్తారు. ఆ సన్నని ఫైబర్ ద్వారా చిన్న జల్లెడను పంపించి, కవాటాలు తిరిగి మూసుపోకుండా నియంత్రిస్తారు. 15 నిమిషాలు పట్టే ఈ సర్జరీ తర్వాత గంటకే ఇంటికెళ్లిపోవచ్చు. మరుసటి రోజు నుంచే పనులన్నీ చేసుకోవచ్చు.

వెరికోజ్ వెయిన్స్ అంటే బయటకి ఉబ్బిన రక్తనాళాలు కనిపించాలి అనుకుంటారు. కానీ అది అపోహ మాత్రమే! కేవలం 25% మందిలో మాత్రమే ఉబ్బిన సిరలు బయటకి కనిపిస్తాయి. మిగతా వాళ్లలో అంతర్గతంగా ఉబ్బి ఉంటాయి.

వెరికోజ్ అనే లాటిన్ పదానికి 'ఉబ్బడం' అని అర్థం. ఆకారం మార్చుకుని పెద్దగా తయారైన సిరలను 'వెరికోజ్ వెయిన్స్' అంటారు.

కాళ్లు నలుపెక్కుతాయి..

సిరలు ఉబ్బుతాయి.. కొద్దో గొప్పో నొప్పీ ఉంటుంది.. చూడడానికి ఎబ్బెట్టుగా ఉన్నా అంతగా ఇబ్బంది లేదని నిర్లక్ష్యం చేస్తాం! కానీ 'వెరికోజ్ వెయిన్స్'ను ఆదమరిస్తే అంతే సంగతులు! ఆలోచించండి!






# అఖిల్ వర్సెస్ సూరి.. అసలేం జరుగుతోంది?



నటవారసులతో పని చేయడం అంటేనే బిగ్ ఛాలెంజ్. ష్యూర్ షాట్ గా హిట్ ఇవ్వాలన్న కండీషన్ ఉంటుంది. దానికి తగ్గట్టు స్క్రిప్టు పని మొదలు ప్రతిదీ చాలా అలెర్ట్ గా ఉండాలి. ముఖ్యంగా కథా చర్చల కోసమే చాలా ఎక్కువ సమయం కేటాయించి ఆరంభమే ఎలాంటి సమస్యా లేకుండా జాగ్రత్తపడాలి. బౌండ్ స్క్రిప్ట్ వంద శాతం ది బెస్ట్ గా కుదిరింది అన్నప్పుడే చిత్రీకరణకు వెళ్లాల్సి ఉంటుంది. సరిగ్గా ఇలాంటి సన్నివేశమే అఖిల్ – సురేందర్ రెడ్డి మూవీ ప్రారంభానికి అడ్డంకిగా మారిందన్న గుసగుసలు ఫిలింనగర్‌లో వినిపిస్తున్నాయి. సురేందర్ రెడ్డి స్క్రిప్టు దశలోనే 200 శాతం పక్కాగా ఉండాలని పని చేస్తున్నారట. ఇప్పటికే పలుమార్లు స్క్రిప్టుకు తుది మెరుగులు దిద్దారు. వక్కంతం వంశీ(కథ ఆయనదే)తో కలిసి స్క్రిప్టులో అవసరం మేర మార్పులు చేర్పులు చేశారు. ఇందులో అఖిల్ బాడీ లాంగ్వేజ్ కి తగ్గట్టు రొమాన్స్.. యాక్షన్.. ఉండాలని దానికోసం ప్రత్యేకించి గ్రౌండ్ వర్క్ చేశారట. ఇక రేసుగుర్రం రేంజులో మాస్ ఎలిమెంట్స్ కామెడీని వర్కవుట్ చేసేందుకు చాలానే సన్నివేశాల్ని రెడీ చేశారట. ఓవరాల్ గా స్క్రిప్టు ఫైనల్ డ్రాఫ్ట్ రెడీ అవుతోంది. ఈలోగానే బొమ్మరిల్లు భాస్కర్ తో మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ చిత్రీకరణ పూర్తవుతోంది. ఈ నెలాఖరు నాటికి ఈ మూవీ చిత్రీకరణను ముగించి అఖిల్ ఫ్రీ అవుతాడట. తదుపరి పూర్తిగా సురేందర్ రెడ్డి తో జాయిన్ అవుతాడు. మొత్తంగా స్క్రిప్టులో తుదిమెరుగులకు ఎక్కువ సమయం కేటాయించడం వల్లనే అఖిల్–సూరి షూటింగ్ ఆలస్యం అవుతోందట. మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ చిత్రాన్ని వేసవిలో రిలీజ్ చేయనున్నారు.

# 'క్రాక్' సినిమాని ఏఎంబి సినిమాస్‌లో చూసిన యూత్ స్టార్..!



మాస్ మహారాజ్ రవితేజ – దర్శకుడు గోపీచంద్ కాంబినేషన్ లో వచ్చిన హ్యాట్రిక్ మూవీ "క్రాక్" సూపర్ హిట్ టాక్‌తో నడుస్తోంది. కోవిడ్ నేపథ్యంలో చాలా గ్యాప్ తర్వాత థియేటర్స్ లోకి వచ్చిన ఈ మాస్ మూవీకి ఆడియన్స్ నుంచి మంచి స్పందన వస్తోంది. వరుస ఫ్లోప్ లతో డీలా పడిన రవితేజకు 'క్రాక్' క్రాకిఫైడ్ హిట్ దక్కిందని అంటున్నారు. అయితే 'క్రాక్' సినిమా కోసం సినీ ఇండస్ట్రీ ప్రముఖులందరూ సపోర్ట్ చేశారు. థియేటర్స్ కి వచ్చి ఈ సినిమాని చూడమని చెబుతూ పోస్టులు పెడుతూ తమ వంతు బాధ్యత నిర్వర్తించారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి యూత్ స్టార్ నితిన్ 'క్రాక్' సినిమా చూసినట్లు పేర్కొన్నాడు. ఫైనల్లీ హిట్టింగ్ ది సిల్వర్ స్క్రీన్ అంటూ ట్వీట్ చేసిన నితిన్.. 'క్రాక్' సినిమాని గచ్చిబౌలి సమీపంలోని ఏఎంబీ సినిమాస్ లో చూసినట్లు వెల్లడించాడు. మేజర్ మిస్సింగ్ అంటూ హ్యాష్ ట్యాగ్ పెట్టి రెండు ఫోటోలను షేర్ చేశాడు. అందులో ఒకదాంట్లో నితిన్ వెండితెరను చూస్తూ గాల్లో చేతులు చూపిస్తూ ఉన్నాడు. మరో ఫోటోలో బ్లూ జీన్స్ బ్లాక్ టీ షర్ట్ లో ఉన్న నితిన్.. మాస్క్ ధరించి సినిమా ఎంజాయ్ చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇదిలా ఉండగా నితిన్ నటిస్తున్న తాజా చిత్రం 'రంగ్ దే' ని మార్చి 26న విడుదల చేయనున్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నితిన్ సరసన మహానటి కీర్తి సురేష్ నటిస్తోంది.

# జక్కన్నకు మహేష్ ఫ్యాన్స్ రిక్వెస్ట్





టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు జక్కన్న రాజమౌళిల కాంబో మూవీ కోసం అపభిమానులు గత రెండేళ్ల కాలంగా ఎదురు చూస్తున్నారు. బాహుబలి తర్వాత మహేష్ తో సినిమా చేయాల్సి ఉందని జక్కన్న ఒకానొక సమయంలో చెప్పాడు. కాని కొన్ని కారణాల వల్ల బాహుబలి తర్వాత జక్కన్న 'ఆర్ఆర్ఆర్' సినిమాను పట్టాలెక్కించాడు. ఆ మధ్య ఒక ఇంటర్వ్యూలో ఆర్ఆర్ ఆర్ సినిమా తర్వాత ఖచ్చితంగా మమేష్ బాబుతో సినిమా ఉంటుందని రాజమౌళి అన్నాడు. ఆయన మాటలను బట్టి ఈసారి ఖచ్చితంగా మహేష్ బాబుతోనే సినిమాను తెరకెక్కించే అవకాశాలు ఉన్నాయని మీడియా సర్కిల్స్‌లో టాక్ వినిపిస్తుంది. ఆ కారణంగానే అభిమానులు అంచనాలు భారీగా పెంచేసుకున్నారు. మహేష్ బాబును ఒక విభిన్న రీతిలో రాజమౌళి చూపించాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఇటీవల ఒక యాడ్ లో మహేష్ బాబు బాలీవుడ్ హీరోతో కలిసి యాక్షన్ సన్నివేశాల్లో నటించాడు. అవి అంతగా ప్రేక్షకులను ఆకట్టుకోలేక పోయాయి. ఇలాంటి రాజమౌళి దర్శకత్వంలో చేస్తే అద్భుతంగా ఉంటాయి అనేది మహేష్ అభిమానుల అభిప్రాయం. అందుకే మహేష్ బాబును ఒక యాక్షన్ డ్రామా కథలో భారీ యాక్షన్ సన్నివేశాల్లో నటింపజేయాలని అభిమానులు రాజమౌళిని కోరుతున్నారు. ఆర్ఆర్ ఆర్ సినిమా పూర్తి అయ్యే వరకు మహేష్ బాబుతో ఎలాంటి సినిమా ను చేయాలనే ఆలోచన కూడా జక్కన్న చేయకపోవచ్చు. అయినా కూడా అభిమానులు మాత్రం ఆయ నకు రిక్వెస్ట్ లు పెడుతూనే ఉన్నారు.

# రీయూనియన్ పార్టీలో అల.. టీమ్ ఫుల్ చిలౌట్!

2020 సంక్రాంతి కానుకగా రిలీజైన అల వైకుంఠపురములో సెన్సేషనల్ హిట్ సాధించిన సంగతి తెలిసిందే. పరిశ్రమలో నాన్ బాహుబలి రికార్డుల్ని తిరగరాసిన చిత్రంగా రికార్డులకెక్కడమే గాక.. అల్లు అర్జున్ కెరీర్ బెస్ట్ సినిమాగా నిలిచింది. ఈ సినిమా త్రివిక్రమ్ కి .. పూజా హెగ్దే.. నివేధ థామస్ వంటి వారికి పెద్ద బ్రేకింగ్ పాయిం ట్. వీటన్నిటినీ మించి ఎస్.ఎస్. థమన్‌ని మ్యూజిక్ డైరెక్టర్ గా మరో పది మెట్లు ఎక్కించిన గ్రేట్ మూవీగా రికార్డులకెక్కింది. అల.. మ్యూజికల్ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. పాటలు ప్రపంచవ్యాప్తంగా ట్రెండ్ అయ్యా యి. మిలియన్ల వీక్షణలను సాధించాయి. 2020 అల .. టీమ్ కి మరపురని సంవత్సరం. అందుకే మొదటి వార్షికోత్సవ వేడుకను చిత్రబృందం ఘనంగా నిర్వహిం చింది. సోమవారం రాత్రి హైదరా బాద్ లో రీయూనైట్ పార్టీ జరిగింది. నాయకానాయికలతో పాటు.. హాస్యనటుడు సునీల్– నవదీప్– సుశాంత్– సముదిరకని తదితరు లు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. నిర్మాతలు అల్లు అరవింద్.. ఎస్ రాధా కృష్ణ ఈ పార్టీలో కనిపించారు. థమన్ ఈ వేదిక వద్ద లైవ్ కాన్సెర్ట్‌ని నిర్వహించగా అహూతులు పార్టీని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ పార్టీకి సంబం ధించిన ఫోటోలు అంతర్జాలంలో వైరల్ అవుతున్నాయి.

# త్రివిక్రమ్‌తో హ్యాట్రిక్ సినిమా చేయనున్న స్టార్ హీరోయిన్..!!



ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీలో హీరోయిన్ పూజా హెగ్దే హవా మాములుగా లేదు. వరుస సినిమాలతో బిజీ బిజీగా గడుపుతుంది. 'అరవింద సమేత' గద్దలకొండ గణేష్ మహర్షి లాంటి భారీ విజయాల తర్వాత తన హిట్లను కొనసాగిస్తూ గతేడాది త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'అల వైకుంఠపురంలో' సినిమాతో ఇండస్ట్రీ హిట్ అందుకుంది. ప్రస్తుతం అమ్మడి చేతిలో డార్లింగ్ ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న రాధేశ్యామ్ సినిమా కూడా ఉంది. రాధేశ్యామ్ తో పాటు అఖిల్ హీరోగా నటిస్తున్న 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' మూవీ షూటింగ్ కూడా ఈ భామ కంప్లీట్ చేసుకుందట. ఇవేగాక బాలీవుడ్ స్టార్ హీరో రణ్వీర్ సింగ్ సరసన 'సర్కస్' సినిమా షూటింగులో పాల్గొంది అమ్మడు. ఇదివరకే కండలవీరుడు సల్మాన్ ఖాన్‌తో 'కబీ ఈద్ కబీ దీవాలి' సినిమా ఓకే చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అయితే పూజాహెగ్దే చేతిలో ఈ నాలుగు క్రేజీ ప్రాజెక్ట్స్ ఒక్కొక్కటిగా రెడీ అవుతున్నాయి. ఇదిలా ఉండగా.. ఈ అమ్మడి హవాను కంటిన్యూ చేస్తూ తాజాగా మరో సినిమా ఓకే చేసినట్లు చెప్పకనే చెప్పేసింది పూజా. అరవింద సమేత తర్వాత ఎన్టీఆర్ త్రివిక్రమ్ కాంబినేషన్ లో తెరకెక్కనున్న మూవీ 'అయినను పోయిరావలే హస్తినకు'. భారీ అంచనాల మధ్య రెడీ కాబోతున్న ఈ సినిమాలో పూజా హెగ్దే హీరోయిన్ గా ఓకే అయిందని తెలుస్తుంది. తాజాగా జరిపిన అల వైకుంఠపురంలో రీయూనియన్ ప్రోగ్రాంలో ఈ అమ్మడు నెక్స్ట్ త్రివిక్రమ్ సినిమా చేయబోతున్నాడు తొందరపడి చెప్పేసింది. ఇంకేముంది త్రివిక్రమ్ నెక్స్ట్ సినిమా ఎన్టీఆర్ తో కాబట్టి వీరి సెకండ్ కాంబినేషన్ ఓకే అయిందని అనుకోవచ్చు. అరవిందసమేత కోసం త్రివిక్రమ్ ఎన్టీఆర్ పూజా జతకట్టారు. మరోసారి ఈ కాంబో సెట్ అవ్వడం ఫ్యాన్స్ కొంచం ఊరట. కానీ త్రివిక్రమ్‌తో పూజాకిది మూడో సినిమా. చూడాలి మరి అమ్మడిని ఈసారి ఎలా చూపిస్తాడో..!!


మాస్టర్ కీ TV
(అంబేడ్కర్ TV)

జై భీం,

మీరు నాయకుడిగా ఎదగాలని అనుకుంటున్నారా...?
మీరనుకున్న వార్తలు రావాలని కోరుకుంటున్నారా...?
పెట్టుబడి లేకుండా ఆదాయం పొందాలని అనుకుంటున్నారా...?
మీరూ మీ అసెంబ్లీ నియోజకవర్గం లో
టీవీ ఛానల్ ఓనర్ గా కావాలని అనుకుంటున్నారా...?

అయితే రండి, కదలి రండీ

బహుజనాభివృద్దే.. దేశాభివృద్ధి అని నిరూపిద్దాం

1. ఈ దేశంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ (మీడియా రంగం) బహుజనుల సమస్యల మీద ప్రచారం చేయడం లేదని మీ అందరికీ తెలుసు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా విలేఖరులకు సామాజిక కార్యకర్తలకు, అంబేడ్కర్, పూలే సంఘం నాయకులకు, కనీసం 100 మంది తెలిసిన గ్రూపునాయకులకు టీవీ ఛానల్ ప్రతినిధిగా / యజమానిగా అవకాశం ఇవ్వబడును.
2. జీవిత కాలంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతినిధిగా / యజమానిగా నియమించబడును.
3. ఆయా ప్రతినిధికి ప్రకటనల ఆదాయం (Advertising Revenue)లో ప్రకటనలపై 40% ఆదాయం ఇవ్వబడును.
4. వార్తలను స్వేచ్ఛాయతంగా ప్రసారం (Telecast) చేసే వీలు కల్పించబడును.

సంప్రదించండి

Tel No: 9849031420 ,9440918143, 94409 18371, 94400 53858, 93473 50692,8008840506, 9440077239, 7798832998, 76600 27678,

Office: Ambedkar TV Channel, 3rd Floor, Dault Plaza, Main Road, Besides Bata Showroom, Lakdi ka pool, Hyderabad - 500004

E- mail : ambedkartvchannel2018@gmail.com www.ambedkartv.org


Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989